

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 01.11.2025 | సంపుటి : 2 | సంచిక :267 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 01.11.2025 | volume : 2 | Issue : 267 | Pages : 8 | Cost : 2/- |




07

## రూ.10వేల కోట్లు ఇవ్వండి

టాటా సన్స్‌ను అభ్యర్థించిన ఎయిరిండియా



07

## నష్టాల్లో ముగిసిన సూచీలు

460 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్

# ఎకరా పంట నష్టానికి ₹50వేలు

పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు

- ఇసుకమేటలు తొలగించేందుకు ప్రణాళికలు
- తీవ్ర ప్రభావం12 జిల్లాల్లో మొంథా తుఫాన్
- వరంగల్ వరద ప్రాంతాల్లో సిఎం రేవంత్ ఏరియల్ సర్వే
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

మృతి చెందిన వారికి 5లక్షల పరిహారం

02

ఇసుకమేటలు తొలగించేందుకు ప్రణాళికలు





'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు.




# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

## రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్

### సిఎం రేవంత్ , మంత్రులు తదితరుల హాజరు

హైదరాబాద్, అక్టోబర్ 31 తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం

-మిగతా 2 లో..



06

# భారత్ బలం ఏంటో తెలిసొచ్చింది

## దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలి

### భారతదేశాన్ని ఏకంచేసి పటేల్ చరిత్ర సృష్టించారు

### వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ప్రధాని నరేంద్రమోడీ

చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్రవాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్రవాదులకు తెలిసింది. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం" అని మోదీ మాట్లాడారు.

# పహల్గాం ఉగ్రవాదులను హతమార్చిన పోలీసులకు పురస్కారాలు



06

ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా వివిధ ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 1466 మంది పోలీసులకు కేంద్ర హోంశాఖ అత్యుత్తమ పురస్కారాలు ప్రకటించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పోలీసులు సహా కేంద్ర బలగాలను 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్ 2025'కు ఎంపిక చేశారు. వీరిలో పహల్గాం ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్న 40 మంది జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు.

# నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి..

## రెండేళ్లలోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,అక్టోబర్31 : రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో పలువురు ఎంఐఎం నాయకులకు కండువా కప్పి గులాబీ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు

-మిగతా 2 లో..



# రూ.1,031 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల

## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

### నిధుల విడుదల చేస్తూ డిప్యూటి సిఎం భట్టి ఆదేశం

హైదరాబాద్,అక్టోబర్31 :తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఉద్యోగుల బకాయిలతోపాటు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అక్టోబర్ నెల పెండింగ్ బిల్లులు సుమారు రూ. 1,031 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల

-మిగతా 2 లో..

# తుఫాన్ సమయంలో ఇలాగేన వ్యవహరించేది

## చంద్రబాబును చూసి నేర్చుకో

- గతంలో ఇస్తామన్న సాయం ఎందుకు ఇవ్వలేదు
- మైనార్టీ ఓట్ల కోసమే అజార్‌కు పదవి
- అజారుద్దీన్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు నిజం కాదా
- బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, అక్టోబర్ 31 : తెలంగాణ రాష్ట్రమంతా మొంథా తుఫాన్‌లో అల్లకల్లోలం అవుతోందని.. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏం చర్యలు చేపట్టారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మొంథా తుఫాన్ చర్యలపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఏప్రిల్, మేలో కూడా అకాల వర్షాలు కురిశాయని.. ఆ సమయంలో

-మిగతా 2 లో..

# తెలంగాణలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. అభివృద్ధి సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక కార్యదర్శిగా సైదులుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి, సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు.

# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు

హైదరాబాద్,అక్టోబర్31 : తెలంగాణలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఈ పరీక్షలు

-మిగతా 2 లో..





# ఓట్లడగానికి వస్తే కర్రుకాల్చి వాతపెట్టండి

- పదేళ్లుగా బిఆర్ఎస్, బిజెపి ఏం చేశాయో నిలదీయండి
- ఎందుకు అభివృద్ధి చేయలేదో గట్టిగా అడగండి
- నవీన్ యాదవ్ గెలిస్తే..అజారుద్దీన్ కూడా మీ వెంట ఉంటాడు
- జూబ్లీహిల్స్ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 31 :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెహమత్ నగర్‌లోని పీజేఆర్ విగ్రహం వద్ద నుంచి సీఎం రోడ్‌షోలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజకీయల్లో ఒడిదొడుకులు, ఎత్తుపల్లాలు ఉంటాయి. అవకాశం అందరికీ అన్నిసార్లు రాకపోవచ్చు. అవకాశం వస్తే మన కోసం కష్టపడే వ్యక్తిని నెగ్గించుకోవాలి. అలా చేయకపోతే చారిత్రక తప్పిదమే అవుతుందన్నారు.కాబట్టి సెంటిమెంట్‌కు తావులేదని, జూబ్లీహిల్స్ అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిని గెలిపించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇక్కడ నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే ఇద్దరు మంత్రులుగా నవీన్‌కు తోడుగా అజారుద్దీన్ కూడా మీ వెంట నడుస్తారని అన్నారు. మీకు ఏ సమస్య ఉన్నా చెప్పడానికి, పరిష్కరించడానికి వీరు పనిచేస్తారని అన్నారు. జూబ్లీహిల్ అభివృద్ధిని గత పదేళ్లుగా ఎందుకు పట్టించుకోలేదో బిఆర్ఎస్ చెప్పాలన్నారు. ప్రపంచమంతా జూబ్లీహిల్స గురించి తెలుసు..కానీ ఇక్కడ సమస్యలపై గతంలో మంత్రిగా ఉన్న కెటిఆర్ ఎందుకు పట్టించుకోలేదో అడగాలన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు బిజెపి నుంచి ఉనినా బుడ్డ పైస కూడా తీసుకుని రాలేదన్నారు. వారు ఓట్లకోసం వస్తే సరాతం కాల్చి వాతలు పెట్టాలన్నారు. సెంటిమెంట్ పేరుతో ఆశీర్వదించాలని భారత రాష్ట్రసమితి ముందుకొచ్చింది. పీజేఆర్ అకాల మరణం చెందితే ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేశారు. ఆనాడు పీజేఆర్ గౌరవార్థం రాజకీయ వైరుధ్యాన్ని చంద్రబాబు పక్కనపెట్టారు. ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేయడానికి చంద్రబాబు సహకరించారు. కానీ, పీజేఆర్ కుటుంబంపై పోటీకి భారత రాష్ట్రసమితి అభ్యర్థిని నిలబెట్టింది. దుష్ట సంప్రదాయాన్ని తీసుకొచ్చింది భారత రాష్ట్రసమితి నేతలు కాదా..? అని రేవంత్ మండిపడ్డారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సచ్చిపోయి బీజేపీని గెలిపించిందని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు బీజేపీకి ఓటేసి తెలంగాణలో 8 మంది ఎంపీలను గెలిపించారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని.. ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి జూబ్లీహిల్స్ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డేనని ఆరోపించారు.కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కూడా బీఆర్ఎస్ సానుభూతి ముసుగులో గెలవాలని చూసిందని.. కానీ శ్రీగణెళిష్ తోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని ప్రజలు అతడికి పట్టం కట్టారని అన్నారు. నాకు కుడి భుజంగా నవీన్ గెలుపును ఇవ్వండి.. అభివృద్ధి నేను చూపిస్తానన్నారు. రాబోయే 40 ఏళ్లు మీకు నవీన్ అండగా ఉంటాడని.. అతడిని భారీ మెజారిటీతో గెలిపియ్యండని విజ్ఞప్తి చేశారు. ఓట్ల కోసం బీఆర్ఎస్ నేతలు వస్తే కర్రుకాల్చి వాత పెట్టండని అన్నారు. సిఎం వెంట మంత్రి అజారుద్దీన్, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# 12 జిల్లాల్లో మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం

**హనుమకొండ, అక్టోబర్ 31 :** తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులకునే ప్రసక్తే లేదన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్ సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టం అంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా



వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని వార్నింగ్ ఇచ్చారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేయాలని సూచించారు. ఇండ్లు కోల్పోయిన వాళ్ల లిస్ట్ సిద్ధం చేసి ఇండ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ముంపు తీవ్రత పెరిగిందని చెప్పుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకోవాలని, వరద ప్రభావంపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విజిట్ చేయాలని హుకుం జారీ చేశారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు.

ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు కూడా తెచ్చుకుందామని తెలిపారు. గతంలో కేంద్ర నిధులు వాడుకోలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఇండ్లు, పంటలు, పశువుల నష్టంపై పూర్తి నివేదిక కావాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని ఆజ్ఞాపించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సిఎం వెంట మంత్రి పొంగులేటి, మేయర్ గుండుసుధారాణి తదితరులు ఉన్నారు.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెల



# రెండేళ్లలోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే.

# తెలంగాణలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్,అక్టోబర్31 :** అలాగే, సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్‌గానూ ఆయన కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. రవాణాశాఖ కమిషనర్‌గా కె.ఇలంబర్తిని నియమించిన ప్రభుత్వం.. పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ఆయనకు అప్పగించింది. మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలు సీఎస్ వద్దే ఉంచింది. జీఏడీ కార్యదర్శిగా ఇ.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చింది. టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించిన సర్కార్.. ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా జి.జితేందర్‌రెడ్డిని నియమించింది. అలాగే, ఎస్సీ సహకార సంస్థ ఎండీగా ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించింది.

# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై ఫిబ్రవరి 21వ తేదీ నాటికి పూర్తవుతాయని పేర్కొంది. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు కేవలం సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు జరిగేవి. ఈసారి వీరితో పాటు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకూ ల్యాబ్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో జనవరి 21వ తేదీన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, జనవరి 23వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 24వ తేదీన ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.



# టెక్నాలజీ ఎంత అవసరమో..అంత డేంజర్

- డీప్‌ఫేక్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే
- యూనిటీఫర్ రన్‌లో పాల్గొన్న నటుడు చిరంజీవి

**హైదరాబాద్, అక్టోబర్ 31 :** డీప్‌ఫేక్‌పై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. డీప్‌ఫేక్ అనేది పెద్ద గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. ఇప్పటికే ఈ అంశాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లానని.. డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌లు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారని తెలిపారు. ఈ కేసును సీపీ సజ్జనార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. పోలీసు వ్యవస్థ చాలా బలంగా ఉందని.. ప్రజలకు పోలీసులు అండగా ఉన్నారని తెలిపారు. ఎవరూ డీప్‌ఫేక్, సైబర్ నేరాలకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పెరుగుతున్న టెక్నాలజీని ఆహ్వానించాలని... కానీ దాని వల్ల ముప్పు కూడా ఉందన్నారు. ప్రభుత్వాలు కూడా దీనిపై ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. లేదంటే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు ఎదురుకునే అవకాశం ఉంటుందని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి డీప్‌ఫేక్ అంశాన్ని సీరియస్ తీసుకున్నామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. డీప్‌ఫేక్ కేసులో సైబర్ నేరస్తుల మూలాలపై ఫోకస్ పెట్టినట్లు చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన టాస్క్ ఫోర్స్ శ్రీకాంత్ గౌడ్‌ను సస్పెండ్ చేశామన్నారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఉప్పలపాటి సతీష్‌పై సీఐడీ, జీఎస్టీ కేసులు ఉన్నాయన్నారు. నిందితుల కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామని.. త్వరలో నిందితులను పట్టుకుంటామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రాష్ట్ర ఏక్తా దివస్ 2025లో భాగంగా నె÷-లకెస్ రోడ్డులోని పీపుల్స్ ఎ÷-లాజాలో 'ఐక్యత రన్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు చిరంజీవి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీ హబ్ వద్ద నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ రితిరాజ్ పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# చంద్రబాబును చూసి నేర్చుకో

- తుఫాన్ సమయంలో ఇలాగేన వ్యవహరించేది
- గతంలో ఇస్తామన్న సాయం ఎందుకు ఇవ్వలేదు
- మైనార్టీ ఓట్ల కోసమే అజార్‌కు పదవి
- అజారుద్దీన్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు నిజం కాదా
- బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** తెలంగాణ రాష్ట్రమంతా మొంథా తుఫాన్‌లో అల్లకల్లోలం అవుతోందని.. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏం చర్యలు చేపట్టారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మొంథా తుఫాన్ చర్యలపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఏప్రిల్, మేలో కూడా అకాల వర్షాలు కురిశాయని.. ఆ సమయంలో పంట నష్టం జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని చెప్పారని.. ఇంకా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. కేవలం పేపర్ స్టేట్‌మెంట్ మాత్రమే ఇస్తున్నారని.. ఆచరణలోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తుఫాను, వర్షం తదితర విపత్కర పరిస్థితులపై అధికారులతో లెక్కలు తెప్పించుకోవడం.. తర్వాత గాలికి వదిలేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక.. ఎన్ని ఎకరాలకు పరిహారం ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలని, రైతులని ఆదుకోవాలనే ఆలోచన రేవంత్‌రెడ్డికి లేదన్ని ÷ర్ అయ్యారు. తడిసిన ధాన్యంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంత దుర్మార్గమైన పాలన జరుగుతుందో ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మొసలి కన్నీళ్లు కార్చి.. గాలి మోటార్లలో సీఎం రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారని ఆక్షేపించారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీ ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆడుతున్న ఆటని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా మ్యాచ్ ఫిక్సింగ్‌కి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని.. ఆయనతో మంత్రిగా ఎలా ప్రమాణ స్వీకారం చేయించారని ప్రశ్నల వర్షం కురిపించారు. గో సంరక్షకులను తుపాకీతో కాలిస్తే ఇంకా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. సీఎం వెనుక మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఉన్నారని ఆరోపించారు. అసదుద్దీన్ డి ఫాక్టో సీఎంగా వ్యవహారిస్తున్నారని విమర్శించారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్, మజ్లిస్ ఆడుతున్న నాటకాలని ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు రాజ్యాంగాన్ని ఇద్దరే చదివినట్లున్నారని విమర్శించారు. ఒక వర్గం మెప్పు కోసం కాంగ్రెస్ చేసే ప్రయత్నం చట్ట వ్యతిరేకమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌కి మజ్లిస్ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలో ఎంఐఎం అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని నిలదీశారు. అజారుద్దీన్‌కి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాకముందే మంత్రి పదవిని అసదుద్దీన్ ఇప్పించుకున్నారని విమర్శించారు. హిందువులను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీ నేతలకి పట్టం కడుతున్నారన్ని ÷ర్ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో హిందువులే కాంగ్రెస్‌కి దిమ్మ తిరిగే తీర్పు ఇవ్వబోతున్నారని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఏకకాలంలో నిధులను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను కాంగ్రెస్ సర్కార్ దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోంది. అందులో భాగంగా అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను విడుదల చేశారు. రూ.10లక్షల లోపు పెండింగ్ బిల్లులను సైతం క్లియర్ చేయాలన్న సర్కార్ నిర్ణయంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అధికారులు రిలీజ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన రూ.10లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లనూ అధికారులు రిలీజ్ చేశారు.

# సోలార్ విద్యుత్‌కు నైవేలీ పెట్టుబడులు

- తెలంగాణలో 10వేల కోట్లతో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అంగీకారం
- భూములు కేటాయించి సహకరించాలని ప్రభుత్వానికి సూచన
- డిస్కమ్‌లను నష్టాల ఊబిలోకి నెడుతున్న తెలంగాణ ప్రభుత్వం
- కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** నైవేలీ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ తెలంగాణలో రూ.10,000 కోట్ల పెట్టుబడులతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించి, ఈ పెట్టుబడులకు సహకరించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ సంవత్సరానికి సగటున 9.8 శాతం పెరుగుతోంది. 2030 నాటికి రాష్ట్రానికి 33,773 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని చెప్పారు. అయితే, రాష్ట్రంలోని డిస్కంలు (విద్యుత్ పంపిణీ సంస్థలు), పవర్ ప్రొడక్షన్ యూనిట్లు తీవ్ర నష్టాల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో కొనసాగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.30,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి రూ.42,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలంటే ప్రభుత్వం వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల ఉత్పత్తిలో 74 శాతం థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి అవుతోందని చెప్పారు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రాల వద్ద 22 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లోనే సోలార్ పంప్ సెట్లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, గృహ అవసరాల కోసం లక్షలాది కుటుంబాలు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసుకుని, విక్రయించుకునే వీలు కలుగుతుందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కనీస మద్దతు ధరను భారీగా పెంచామని, యూరియా వంటి ఎరువుల ధరలు పెరిగినా కూడా సబ్సిడీ ధరకే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 450 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లకు అనుమతి ఇవ్వామని, అలాగే 40 వేల సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారని.. ఇందులో 20,000 యూనిట్లు మొదటి విడతలో ఇన్‌స్టాల్ చేస్తామని వివరించారు. రామగుండం ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ను దశలవారీగా నిర్మిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో రూ.12,000 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023లో ప్రారంభించారని, రెండో విడతలో 3800 మెగావాట్ల ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇందులో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 80 శాతం తెలంగాణకే కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మొత్తం విద్యుత్ కొనుగోలు చేయకుండా మూడో వంతు మాత్రమే తీసుకుంటోందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీపీసీ ఉత్పత్తి చేసిన మొత్తం విద్యుత్‌ను కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు పూర్తయ్యాయని, మరో 56 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. రామగుండంలో 121 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్లుగా మైనారిటీలకు అన్యాయం చేసి, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల దృష్ట్యా ఓట్ల కోసం ఆ వర్గానికి చెందిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తున్నారని అన్నారు. అజారుద్దీన్‌పై, మైనారిటీలపై ప్రేమ ఉంటే రెండు సంవత్సరాల క్రితం ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికార దుర్వినియోగంతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు.



## ఇందిర గాంధీ, వల్లభాయ్ పటేల్‌కు సీఎం రేవంత్ రెడ్డి నివాళి

**హన్మకొండ, అక్టోబర్ 31 :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఘనంగా నివాళి అర్పించారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లో ఆ మహనీయుల చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏ శాఖ ఇచ్చినా సంతోషమే

- మంత్రి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు
- తనపై ఆరోపణలు ఏవీ రుజువు కాలేదు
- కిషన్ రెడ్డికి నా గురించి సరిగా తెలియదు
- మీడియాతో మంత్రి అజారుద్దీన్



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** మంత్రిగా తనకు అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని అజారుద్దీన్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మీడియాతో అజారుద్దీన్ మాట్లాడారు. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు తనపై చేస్తున్న విమర్శలపై స్పందించారు. నాపై వచ్చినవన్నీ ఆరోపణలు మాత్రమే. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతల విమర్శలు సరైనవి కావు. నా గురించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పూర్తిస్థాయి అవగాహన లేదు. నాపై ఉన్న ఒక్క కేసులోనూ నేరం రుజువు కాలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. మంత్రిగా నాకు అవకాశం కల్పించారు.. నాకు ఏ శాఖ ఇచ్చినా ఇబ్బంది లేదని అజారుద్దీన్ అన్నారు.తెలంగాణ మంత్రిగా కాంగ్రెస్ నేత అజారుద్దీన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు అజారుద్దీన్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హాజరయ్యారు. మంత్రివర్గంలో అజారుద్దీన్ చేరికతో తెలంగాణ కేబినెట్ మంత్రుల సంఖ్య 16కి చేరింది. అయినా తెలంగాణ కేబినెట్‌లో ఇంకా 2 బెర్తులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే.. ఈ సందర్భంగా నూతన మంత్రి అజారుద్దీన్‌కి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి మంత్రివర్గంలోకి ఆహ్వానం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. తన మంత్రి పదవికి, జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముడి పెట్టొద్దని పేర్కొన్నారు. రెండింటినీ వేర్వేరుగా చూడాలని కోరారు. తానేంటో ప్రజలందరికీ తెలుసని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తానని అజారుద్దీన్ స్పష్టం చేశారు.

## శ్రీశైలం జలాశయానికి వరదపోటు

**శ్రీశైలం, అక్టోబర్ 31 :** ఎగువ రాష్ట్రాలతో పాటు.. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది భారీ వర్షాలు కురిశాయి.. ప్రాజెక్టులు, నదులు, చెరువులు, కుంటలు ఇలా కొన్ని ప్రాంతాలను మినహాయిస్తే అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి.. ఇక, పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో రైతన్నలు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి.. అయితే, ఏడాదిలో మరోసారి నీటిపారుదల శాఖ అధికారులు శ్రీశైలం జలాయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు .. శ్రీశైలం జలాశయానికి మరోసారి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఎగువనున్న జూరాల, సుంకేసుల, హంద్రీ నుండి వరద నీరు రావడంతో శ్రీశైలం జలాశయం నుండి ఈ ఏడాది ఏడోవ సారి రేడియల్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు అధికారులు.. శ్రీశైలం జలాశయం ఒక గేటు 10 అడుగుల మేర ఎత్తి.. దిగువకు నీరు విడుదల చేశారు అధికారులు.. ఇక, జలాశయం ఇన్ 68,691 క్యూసెక్కులుగా ఉండగా.. ఔట్ 90,293 క్యూసెక్కులుగా ఉంది.. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.60 అడుగులుగాఉంది.

## ప్రభుత్వ సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు

- ఇద్దరికీ క్యాబినేట్ హోదాతో నియామకాలు
- కేబినేట్ మీటింగ్‌కు హాజరయ్యేలా సుదర్శన్‌కు వెసలుబాటు

**హైదరాబాద్, అక్టోబర్ 31 :** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీ కృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కొరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.



## సమాచారశాఖ డిడి ప్రసాదరావు పదవీ విరమణ

### అభినందనలు తెలిపిన తోటి ఉద్యోగులు

**హైదరాబాద్, అక్టోబర్ 31 :** సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్న జి ప్రసాదరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు వివిధ హోదాల్లో దాదాపు 41 సంవత్సరాల సర్వీసు అనంతరం నేడు ప్రసాదరావు పదవి విరమణ కార్యక్రమాన్ని సమాచార భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ప్రసాదా రావు సేవలను ఈ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన సీనియర్ అధికారులు కొనియాడారు. ఈ పదవి విరమణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డీ.ఎస్ జగన్, డి శ్రీనివాస్, కే వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు హాష్మి, వై వెంకటేశ్వర్లు, సురేష్, ఆర్.ఐ.ఈ జయరాం మూర్తి, తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి లతోపాటు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, డిడి ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వరదలో కొట్టుకుపోయిన యువతి మృతదేహం లభ్యం

**జనగామ, అక్టోబర్ 31 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. కుండపోత వర్షాలతో రాష్ట్రం తడిసి ముద్దయింది. భారీ వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుంటలు, చెరువులు నిండిపోయి ఉధృతంగా ప్రవహించాయి. ఈ క్రమంలోనే జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తిమ్మంపేట శివారులో వరదల్లో గురువారం ప్రేమ జంట గల్లంతయ్యింది. బోళ్లమత్తడి వద్ద ప్రేమికులు బరిగెల శివకుమార్, బక్క శ్రావ్య బైక్‌తో సహా నీటిలో కొట్టుకుపోయారు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న శివకుమార్ చెట్టు కొమ్మను పట్టుకుని బయటపడగా.. శ్రావ్య గల్లంతయ్యింది. వరదల్లో గల్లంతైన యువతి మృతదేహం శుక్రవారం లభ్యమయింది. జిల్లాలోని శంకర్ తండా సమీపంలోని కుంటలో శ్రావ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసు అధికారులు.. మృతదేహాన్ని స్వగ్రామం దమన్నపేటకు తరలించారు. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది

## కోడలిపై అమానుషం..

### బావతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి

**జంగారెడ్డిగూడెం:** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. బావతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని ఓ వివాహితను అత్తమామలు వేధించారు. అందుకు ఆమె నిరాకరించడంతో గత 10 రోజులుగా గదిలో బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మానవ హక్కుల సంఘాల నేతలు ఆమెను రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరానికి చెందిన యువతికి జంగారెడ్డి గూడెంకు చెందిన యువకుడితో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది కిందట ఓ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, భర్త సోదరుడికి పిల్లలు లేకపోవడంతో.. అతడితో కలిసి వారసుడికి జన్మనివ్వాలని అత్తమామలు ఒత్తిడి తీసుకొచ్చారు. ఆమె భర్తను ఊరు పంపించి.. వివాహితను చిత్రహింసలకు గురిచేశారు. బిడ్డతో సహా గదిలో బంధించి మంచినీరు, భోజనం పెట్టకుండా గృహ నిర్బంధం చేశారు. సమాచారం తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, పోలీసులతో కలిసి జంగారెడ్డిగూడెం వచ్చి గది తలుపులు బద్దలుగొట్టి ఆమెను బయటకు తీసుకువచ్చారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు 50వేల పరిహారం ఇవ్వాలి
- కల్వల మత్తడిని పరిశీలించిన కవిత



**కరీంనగర్, అక్టోబర్ 31 :** తెలంగాణలో భారీ వర్షాలకు పంటనష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు కాకుండా.. ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో కొట్టుకుపోయిన కల్వల మత్తడిని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కల్వల మత్తడి కొట్టుకుపోయి 3 ఏళ్ళు అవుతోందని.. దీని రిపేర్ కోసం గత ప్రభుత్వమే రూ.70 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని, కానీ తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు జరగటం లేదన్నారు. ఈ మత్తడిని రిపేర్ చేయించాలని హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్ట్‌పై వందలాది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన రూ. 70 కోట్ల జీవో ను పాస్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా రైతుల బాగు కోసం మత్తడి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదు అనే మాటను నిజం చేయాలంటే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో కట్ట తెగినప్పుడు అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించి తొందరగా దీన్ని పూర్తి చేశారని.. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా మత్తడిని పునరుద్ధరించాలని కోరారు. మొంథా తుపాను కారణంగా తెలంగాణ మొత్తం రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్, ఖమ్మం రైతులకు మాత్రమే ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్నట్లుగా విన్నామని చెప్పారు. శంకరపట్నంలో కూడా వరి రైతులు నష్టపోయారని.. వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఎకరాకు రూ. 10 వేలు కాకుండా ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు చేతికొచ్చిన పంటను రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇప్పుడు పంట కోసిన కూడా 25 శాతం వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రభుత్వం రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి అధికారులను ఫీల్డ్ కు పంపించి పంట నష్టం లెక్కలు తీయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కేంద్రం తరఫున రైతులకు పంట నష్టం పరిహారం ఇప్పించాలని కోరారు. కల్వల మత్తడి రిపేర్ కోసం ముఖ్యమంత్రితో ఎంపీ మాట్లాడాలన్నారు. అటు ఈ ప్రాజెక్ట్ మీదనే దాదాపు 180 ముదిరాజ్ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని.. వారికి ఇదే జీవనాధారమని చెప్పారు. వెంటనే మత్తడి బాగు చేయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## చాక్లెట్ ఆశ చూపి చిన్నారిపై అఘాయిత్యం

**చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిపై మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి అఘాయిత్యానికి పాల్పడ్డారు. చిన్నారి కేకలు వేయడంతో తలుపులు పగలగొట్టి స్థానికులు చిన్నారిని కాపాడారు. బాలికను ఆస్పత్రికి తరలించి, నిందితులను పోలీసులకు అప్పగించారు. చిన్నారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిందితులు మద్యం లేదా గంజాయి సేవించి ఉండొచ్చని, ఆ మత్తులోనే చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. అత్యాచారానికి గురైన బాలికను సీడబ్ల్యూసీ బృందం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించింది. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుంది. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిన్నారిని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు.

## పెళ్లి బృందం వాహనాన్ని ఢీకొట్టిన లారీ

### ముగ్గురి దుర్మరణం

**భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో వెళ్తున్న బొలేరో వాహనాన్ని బోర్‌వెల్స్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో 12 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మృతులను కమలమ్మ (60), త్రినాథ్ (5), స్వప్నగా గుర్తించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదన్‌పల్లికి చెందిన యువతిని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపించారు. పెళ్లి వేడుకల్లో భాగంగా వధువు బృందం వరుడి ఇంటికి వెళ్లి తిరిగి మహబూబాబాద్‌కు బయలు దేరింది. ఈ క్రమంలో గోపాల్‌పూర్ వద్ద బొలేరో వాహనాన్ని ఆపారు. దీంతో వెనక నుంచి వచ్చిన లారీ ఆ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఘటనాస్థలంలోనే ముగ్గురు మృతిచెందారు.

## భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట



**హైదరాబాద్:** భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అక్టోబర్ 17న సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సవరించింది. నాగారం సర్వే నెంబర్ 194, 195లో ఐఏఎస్, ఐపీఎస్‌లు కొనుగోలు చేసిన భూములను నిషేధిత జాబితాలో ఉంచాలంటూ సింగిల్ బెంచ్ గతంలో తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు ఐపీఎస్‌లను డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆధారాలను పరిశీలించిన డివిజన్ బెంచ్.. అవి భూదాన్ భూములు కానప్పుడు నిషేధిత జాబితాలో ఎందుకు ఉంచాలని వ్యాఖ్యానించింది. సర్వే నెంబర్ 194, 195లోని భూములు పట్టా భూములేనని కలెక్టర్ కూడా నివేదిక ఇచ్చారు. సర్వే నెంబర్ 181, 182లలో ఉన్న భూములపై మాత్రం యథాతథ స్థితి కొనసాగుతుందని డివిజన్ బెంచ్ పేర్కొంది.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బతుకమ్మ కుంట ప్రైవేట్ స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని సుధాకర్ అనే వ్యక్తి ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని రంగనాథ్‌ను ప్రశ్నించింది.

## హెచ్1బీ వీసా దుర్వినియోగంపై అమెరికా కార్మిక శాఖ వీడియో

**యూఎస్:** హెచ్-1బీ వీసాల దుర్వినియోగంపై ట్రంప్ సర్కారు గత కొంతకాలంగా ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో అక్కడి లేబర్ డిపార్ట్‌మెంట్ 'ఎక్స్' వేదికగా ఓ వీడియో యాడ్‌ను విడుదల చేసింది. హెచ్1బీ వీసాలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని అందులో పేర్కొంది. ఇలా వీసాలు పొందుతున్నవారిలో అత్యధికులు భారతీయులు కూడా ఉన్నారని సదరు వీడియోలో పేర్కొంది. "హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తున్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అమెరికా కలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ మా యువత విషయంలో అలా జరగడం లేదు" అని యాడ్‌లో ప్రస్తావించారు. హెచ్-1బీల్లో 72 శాతం భారతీయులకే వెళున్నాయని వీడియోలో భాగంగా ఓ గ్రాఫ్‌లో చూపించారు. ఈ వీసాల విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా..? అని గుర్తించేందుకు 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది.

# వరద సహాయక చర్యల్లో వైఫల్యం!



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, అజారుద్దీన్‌కు మంత్రి పదవి..ఈ రెండే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండాలో ఉన్నాయా అన్న అనుమానం కలుగుతోంది. మొంథా తుఫాన్‌తో రాష్ట్రం విలవిల్లాడినా, వరంగల్ నగరం మునిగి ప్రజలంతా నీటి పాలయినా ఎక్కడా సహాయక చర్యలు సక్రమంగా లేవు. రెండు రోజులపాటు, ఇల్లూ వాకిలి వదిలి వెళ్లిన ప్రజలు ఇంటికి వచ్చే వరకు సర్వం కొట్టుకు పోయింది. అయినా వారి ఇళ్లను శుభ్రం చేసుకోవాలంటే నీరు లేదు. తాగడానికి నీళ్లు లేవు. భోజనం సంతగి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఉన్నదంతా ఊడ్చుకుపోయినా వారిని ఆదుకునేందుకు ఎవ్వరూ కానరాలేదు. గోపాలపురం, భీమారం పరిధిలోని కాలనీ ప్రజల వ్యథ అంతాఇంతా కాదు. ఎపిలో సిఎం చంద్రబాబు, ఆయన మంత్రులు, అధికారులు నిముష నిముషానికి సమీక్షించి ప్రజలకు అండగా నిలిచారు. తుపాన్ తీరం దాటిన తెలలవారే చంద్రబాబు బాధజత ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రులు పర్యటించారు. కానీ ఓరుగల్లులో అలాంటి పరిస్తితి కానరాలేదు. తెలంగాణలో మాత్రం అలాలేదు. మంత్రులు అందరూ జూబ్లీహిల్స్‌లో ఊరేగితే రాష్ట్రంలో పాలన పరిస్థితి, ప్రజల పరిస్థితి ఏంటని వరంగల్ ముంపు ప్రాంతాలను చూస్తే అర్థం అవుతుంది. మంత్రులు కోరుకుంటే హెలికాప్టర్లు వస్తాయి.. ప్రజలు ఆపదలో ఉంటే మాత్రం రావా అని ప్రజలే నిలదీస్తున్నారు. హనుమకొండ, జులైవాడలో భారీగా కురిసిన వర్షానికి నీట మునిగిన కాలనీలతో పాటు అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించేందుకు మంత్రులు ఎవ్వరూ రాకపోవడం వింతే. మొంథా వరద బీభత్సంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు నీటి మునిగి, నగరం జల దిగ్బంధం అయింది. నిత్యావసర వస్తువులు సహా, విలువైన టీవీ, బీరువాలు సైతం నీట మిగిని ఆస్తి నష్టం వాటిల్లింది. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీటమునిగిన ఇళ్లల్లోనే గడిపారు. తుఫాన్ తీవ్రతను ముందస్తుగా గ్రహించి అంచనా వేయడంలో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. తక్షణమే నీటి మునిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.సమ్మయ్య నగర్ పూర్తిగా నీట మునిగి ప్రజలు సర్వం కోల్పోవడం జరిగింది. ఆవులు, గేదెలు, పశువులు అరుస్తూ వరదల్లో కొట్టుకుపోవడం వాటి యజమానులను కలిచి వేసింది. ఆస్తి నష్టంతో పాటు పశు పక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా వాటిల్లే ప్రమాదం ఉంది. మొంథా తుఫాన్ దూసుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినాముందస్తు చర్యలు తీసుకోవడంల ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సమయంలో ఒక్క జిల్లాకు ఒక్కో మంత్రి ఇంచార్జీగా ఉండి.. వరద ప్రాంత ప్రజలకు రక్షణగా ఉండాలి. ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న వారితో సహా జిల్లాలకు చెందిన మంత్రులు కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. లోతట్టు ప్రాంతాల ప్రజల జీవనం కూడా దుర్భరంగా మారింది. శివనగర్, మైసయ్య నగర్, ఆర్ఎస్ నగర్, చింతల్ ప్రాంతాల్లోని అనేక కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. ముఖ్యంగా శివనగర్ మరియు మైసయ్య నగర్లలోని ఇళ్లలోకి వరద నీరు భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లలోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అన్నీ నీటిలో తడిచి ముద్దయ్యాయి. రాత్రంతా నిద్రలేని రాత్రులు గడిపి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు.

వరద బాధితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు శివనగర్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో బల్దియా పారిశుధ్య కార్మికులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లమీద, డ్రైనేజీ, నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇకపోతే భారీ వర్షాలు, వరదలతో భీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ అన్నదాతల ఆశలపై పిడుగు పాటుగా మారింది. చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. కేవలం పంటలే కాక, లోతట్టు ప్రాంతాల ప్రజల జీవితాలు కూడా వరదనీటిలో చిక్కుకుపోయాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 17వ డివిజన్‌లోని విలీన గ్రామాల రైతులను తుఫాన్ నిండా ముంచింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తూ పూర్తిగా నేలకొరిగాయి. అలాగే, ఖిలా వరంగల్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వందల ఎకరాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయల తోటలు ఏకంగా 6 అడుగుల నీటి కింద మునిగిపోయాయి. కోట ప్రాంతంలో రైతులు తమ సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు.

కళ్ల ముందు పంట నాశనం కావడంతో, వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంట వారం రోజుల్లో చేతికి వస్తది అనుకున్న అన్నదాతల ఆశ ఆడియోసలైంది. మొత్తం తుఫాన్‌కు ఆహుతి కావడంతో, ఆపదలో ఉన్న తమను ఆదుకోవాలని, కనీసం పెట్టుబడికైనా సాయం చేయాలని వారు కోరుకుంటున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే శుక్రవారం వరంగల్ పర్యటనకు సిఎం రేవంత్ రెడ్డి వస్తున్నారు. అయితే మంత్రులు ఇటుపై దృష్టి పెట్టి ముందస్తు హెచ్చరికలు చేసివుంటే..ప్రజలను సరుక్షిత ప్రాంతాలకు తరలించివుంటే నస్టం తగ్గించగలిగే వారు. ఇప్పటికైనా ఆపన్నులను ఆదుకోవాలి. సర్వం కోల్పోయిన వారికి వంటసామాన్లు సహా అన్ని కొని ఇవ్వాలి. రైతులను ఆదుకోవాలి.తడిసిన ధన్యం వెంటనే కొనుగోలు చేయాలి.

# తెలంగాణ రైతులపై మొంథా దెబ్బ

- కొట్టుకు పోయిన కల్లాల్లో ఆరబోసిన ధాన్యం
- కోయని వరి చేలన్నీ నీట మునిగన దృశ్యం
- గోడదెబ్బ.. చెంపదెబ్బలా రైతుల పరిస్థితి



**వరంగల్/కరీంనగర్, అక్టోబర్ 31 :** మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. అలాగే పలుచోట్ల పంటలు నీట మునిగాయి. గోడదెబ్బ చెంపదెబ్బలా రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వానికి అందిన వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.పంజా విసిరిన మొంథా తుఫాన్ దాటికి తల్లడిల్లుతున్న అన్నదాతలను, నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకో వాలని మండల ప్రజలు అర్థిస్తున్నారు. మూడు, నాలుగు నెలలు కష్టపడి పెంచి పెద్ద చేసిన పొలాలు చేతికందే దశలో ఒక్క వర్షం అతలాకుతలం చేసింది. రెండు మూడు రోజుల్లో వరి కోయడానికి సిద్ధంగా ఉన్న రైతులను తుఫాను నిండా ముంచింది. కురిసిన భారీ వర్షంతో పొలాలు కింద పడిపోయి మడికట్లలో నీళ్లు నిలిచిపోయి గొలుసు మొత్తం వాలిపోయింది. ఎక్కడో చోట తప్ప దాదాపు అన్ని పొలాలు నేలవాలాయి. వరి కోయని రైతుల పరిస్థితి ఒకలా ఉంటే కోసిన రైతుల కన్నీటి వ్యథ మరో తీరు ఉన్నది. అమ్ముకునేందుకు కళ్ళాల్లో పోసి ఆరబోసిన తరుణంలో వర్షం రావడంతో తడిసి ముద్దయిపోయాయి. వర్షం వస్తుందన్న సమాచారంతో రాశులుగా పోసినప్పటికీ భారీ వర్షానికి తడిసి పోయాయి. మరోవైపు కల్లాల నుంచి నీళ్లు బయటకు పోలేని పరిస్థితుల్లో పూర్తిగా నీటిమట్ట మయ్యాయి. భారీ వర్షాలకు కుంటలు, వాగులు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కల్వర్టులు ఉప్పొంగడంతో ఎక్కడి వారు అక్కడే నిలిచి పోయారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో పంట నష్టం చోటు చేసుకోగా, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోనూ రైతులు భారీగా నష్టపోయారు. తుఫాను కారణంగా ప్రధానంగా వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2.80 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల ఎకరాల్లో మిరప, వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసేందుకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు.. మొంథా తుఫాను ఎఫెక్ట్ తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు,కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయా రన్నారు.

## రక్షణ, అంతరిక్ష,రంగాల్లో
# మహిళల దూకుడు

### అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, అక్టోబర్ 31 :** దేశంలో రక్షణ, అంతరిక్ష, వ్యవసాయ రంగాలతోపాటు అన్ని రంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం విస్తరిస్తుండటం గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీప్రశంసించారు. శుక్రవారం నాడు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్–2025 ను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ యుద్ధ విమానాన్ని నడిపిన స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్ పేరును ప్రత్యేకించి ప్రస్తావించారు. 'ఇవాళ మన ఆడకూతుళ్లు యుద్ధ విమానాలు నడుపుతున్నారు' అని హర్షం వ్యక్తం చేశారు. మహర్షి దయానంద్ సరస్వతి 200వ జయంతి, 150 ఏళ్లుగా ఆర్యసమాజ్ సేవలకు గుర్తింపుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి ఫెస్టివల్‌లో భాగంగా అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్–2025ను నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండ్రోజుల క్రితం భారత తొలి మహిళా రాఫెల్ పైలట్లలో ఒకరైన స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్‌తో కలిసి రాఫెల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. ఇవాళ మన మహిళలు యుద్ధ విమానాలు నడుపుతున్నారు. డ్రోన్ దీదీలుగా మారి అధునాతన వ్యవసాయాన్నీ ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక మహిళా స్టెమ్ గ్రాడ్యుయేట్లు భారతదేశంలోనే ఉండటం మనకు గర్వంగా చెప్పుకోవచ్చు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లోనూ నాయకత్వ పాత్రను మహిళలు పోషిస్తున్నారు' అని ప్రధాని అన్నారు. దేశంలో గత రెండేళ్లుగా నిరంతర మేథో యజ్ఞం జరుగుతోందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతేడాది దయానంద్ సరస్వతి జన్మస్థలమైన గుజరాత్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని, దానికి ముందు మహర్షి దయానంద్ సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఢిల్లీలోను తాను ప్రారంభించానని చెప్పుకొచ్చారు. అదే ఈవెంట్‌లో రెండేళ్ల పాటు ఈ మహా యజ్ఞాన్ని కొనసాగించాలని నిర్ణయించామని చెప్పారు. సమాజానికి ఆర్యసమాజ్, స్వామి దయానంద సరస్వతి చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. దేశ వైదిక గుర్తింపు, పునరుత్తేజ స్ఫూర్తిని ఈ వేడుకలు ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో స్పీడ్ పెంచిన బిఆర్ఎస్

### రోడ్‌షోలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం ఊపందుకుంది. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత తరఫున ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. షేక్‌పేట డివిజన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఓయూ కాలనీ మీదుగా వినోభానగర్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి మాగంటి సునీత మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన కేసీఆర్, భారత రాష్ట్ర సమితి పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఓ కుటుంబం అని గోపీనాథ్ చెప్పేవారని.. మహిళలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరించేవారని అన్నారు. కష్ట సమయాల్లో ప్రజలకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ప్రజలకు భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేడెక్కుతున్న వేళ, ప్రచార రంగంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఘాటుగా స్పందించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు, పోలీసులు, గుండాయిజాన్నే నమ్ముకున్నారని, కానీ ప్రజలు ఈ రౌడీయిజాలను, బెదిరింపులను ఎప్పుడూ లెక్కపెట్టరు అని వ్యాఖ్యానించారు. తండ్రి లాగానే కుమారుడూ భయపెడతానంటూ మాట్లాడుతున్నారని, కానీ ఇప్పుడు ప్రజలు ఎవరి భయానికీ లొంగరని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి రౌడీలు, గుండాల అంతు ప్రజలు ఎప్పుడో చూశారని, మనం డెమోక్రసీలో ఉన్నామన్న విషయం వీళ్లు మర్చిపోయారన్నారు. కానీ ప్రజల్లో ఒక్కసారి తిరుగుబాటు వచ్చిందంటే ఆ ఉప్పెన ముందు ఎవరూ తట్టుకోలేరు అని హెచ్చరించారు. కాంగ్రెస్ అభ్యర్థి సహజత్వం అదే? చాయ్ కొట్టు, కిల్లీ కొట్టోళ్లను భయపెట్టే వాళ్లని నాయకులంటారా? ప్రజలు ఇప్పుడు ఆలోచిస్తున్నారు అటువంటి నాయకులు నిజంగా అవసరమా అని, ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

# ఏడాదిపాటు పటేల్ జయంతి ఉత్సవాలు

- కాంగ్రెస్‌కు నెహ్రూ ఒక్కరే నేత
- ఇతరనేతలను పట్టించుకోని పార్టీ
- యూనిటీ రన్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** ఏడాది పాటుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉత్సవాలు జరుపుతామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పటేల్ రాజకీయ నేత కాదు రైతాంగ ఉద్యమ నేత అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన యూనిటీ రన్‌లో వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. సర్దార్ పటేల్ అంటే కాంగ్రెస్ పార్టీకి నొప్పి అని.. పీవీ నరసింహారావు అంటే కాంగ్రెస్‌కు నచ్చదంటూ వ్యాఖ్యలు చేశారు. కేవలం నెహ్రూ కుటుంబమే కాంగ్రెస్‌కు నచ్చుతుందన్నారు. కాంగ్రెస్‌కు దేశమంటే నెహ్రూ, నెహ్రూ అంటే దేశమని.. నెహ్రూ తప్ప కాంగ్రెస్‌కు ఎవ్వరూ అవసరం లేదని విమర్శలు గుప్పించారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను ద్రోహం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు. పటేల్‌ను వెన్నుపోటు పొడిచిన చరిత్ర కాంగ్రెస్ ది అంటూ ఆరోపించారు. పటేల్‌ను తెలంగాణ బిడ్డలు ఎవరూ మర్చిపోరని.. సర్దార్ చేసిన త్యాగమే తెలంగాణ అని చెప్పుకొచ్చారు. పటేల్ చొరవతోనే తెలంగాణలో మూడు రంగుల జెండా ఎగిరిందని కేంద్రమంత్రి తెలిపారు. నిజాం నిరంకుశత్వంపై ఉక్కు పాదం మోపిన ఘనుడు పటేల్ అని పేర్కొన్నారు. నిజాం మెడలు వంచి తెలంగాణ గడ్డ మీద మూడు రంగుల జెండా ఎగరవేశారన్నారు. ఈ ఏడాది అంతా పటేల్ 150 జయంతి ఉత్సవాలను తెలంగాణలో ప్రతి ఇంట్లో ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఆయన స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు పటేల్ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. సర్దార్ స్ఫూర్తితో ప్రధాని మోడీ అడుగులు వేస్తున్నారని.. వికసిత భారత్ లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఉక్కు సంకల్పంతో నిజాం మెడలు వంచిన ఘనుడు పటేల్ అని రాజ్యసభ సభ్యు లక్ష్మణ్ అన్నారు. దేశ సమగ్రత కోసం పాటు పడిన వ్యక్తి పటేల్ అని అన్నారు. ఇవాళ స్వేచ్ఛా వాయువులు పిలుస్తున్నామంటే పటేల్ త్యాగఫలితమే అని తెలిపారు. నగరంలో అతిపెద్ద పటేల్ విగ్రహాన్ని నిర్మించుకోవా ల్సిన అవసరం ఉందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు.

# అమితాబ్‌కు బెదిరింపులు

### భారీగా భద్రత పెంచిన కేంద్రం

**ముంబై, అక్టోబర్ 31 :** బాలీవుడ్ బిగ్ బీ అమితా బచ్చన్ కు కేంద్ర భారీగా భద్రత పెంచనుంది. ఇటీవల పంజాబీ సింగర్, నటుడు దిల్జిత్ దోసాంజ్ ' కౌన్ బనేగా కోరోడ్ పతి' ఎపిసోడ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బిగ్ బీ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నా డు. ఇది వివాదానికి దారి తీసింది. ఈ క్రమంలో అమితాబ్ కు బెదిరింపులు వచ్చాయి. బిగ్ బీ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకోవడాన్ని ఖలిస్తానీ సంస్థ 'సిఖ్స్ ఫర్ జస్టిస్' (÷ూఈఏ) తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సంస్థ అధిపతి గురుపత్వంత్ సింగ్ పన్నూ, అమితాబ్‌ను గౌరవించడం అనేది 1984 సిక్కు వ్యతిరేక హింసలో చనిపోయిన వారిని అవమానించడమేనని ఆరోపించారు. అంతేకాకుండా, 1984 అల్లర్లను రెచ్చగొట్టడంలో అమితాబ్ కీలకపాత్ర పోషించారని, ఆయన అప్పుడు 'ఖూన్ కా బద్లా ఖూన్' అనే నినాదాన్ని ఇచ్చారని ÷ూఈఏ ఆరోపిస్తోంది. అయితే, బిగ్ బీ గతంలోనే ఈ ఆరోపణలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, ఖలిస్తాన్ చీఫ్ పన్నూ, నవంబర్ 1న ఆస్ట్రేలియాలో జరగనున్న దిల్జిత్ దోసాంజ్ మ్యూజిక్ కచేరీని అడ్డుకుంటామని బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశాడు. ఈ బెదిరింపులు దిల్జిత్ అభిమానుల్లో, అలాగే చిత్ర పరిశ్రమలో ఆందోళన కలిగించాయి. ఉగ్రవాద సంస్థ నుంచి వచ్చిన ఈ బెదిరింపులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వివాదాస్పద ఆరోపణలు, బెదిరింపుల నేపథ్యంలో అమితాబ్ బచ్చన్ భద్రతను కట్టుదిట్టం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం అమితాబ్‌కు ఏ స్థాయిలో భద్రత ఉంది, దాన్ని ఏ స్థాయికి పెంచబోతున్నారు అనే వివరాలు తెలియాల్సి ఉంది. దేశంలో సీనియర్ నటుడిగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన వ్యక్తిగా బిగ్ బీ భద్రతను కట్టుదిట్టం చేయనుంది.

## అంటువ్యాధులు
# రాకుండా చర్యలు

### ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో మందులు

**నల్గొండ,అక్టోబర్31 :** ఇటీవలి వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ఎపిడమిక్ సెల్, రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశామని నల్గొండ జిల్లావైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ వెల్లడించారు. డివిజన్ల వారీగా జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులకు సెలవులు రద్దు చేశామని, అత్యవసర సేవలు అందించేందుకు పాము, తేలుకాటుకు సంబంధించిన ఔషధాలు సిద్ధంగా ఉంచామన్నారు. డెంగీ, జ్వరాలు రాకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలి. వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు జిల్లాసుపత్రుల్లో రోగులు చికిత్స కోసం వచ్చినా తగిన ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువగా జ్వరాలు, దగ్గు, జలుబు వంటి అంటువ్యాధులతో పాటు పదుల సంఖ్యలో రైతులు పాము, తేలుకాటుకు గురైనవారు ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. పల్లె, బస్తీ దవాఖానాల్లోని వైద్యులకు నవంబరు 3 వరకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవులు రద్దు చేశారు. ఇకపోతే మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో కొన్ని రహదారులు ఛిద్రమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా .. శిథిలమైన పాత భవనాలు, ఇళ్లు నేలమట్టమయ్యాయి. ప్రధానంగా సూర్యాపేట- వరంగల్ ప్రధాన రహదారిపై నెమ్మికల్ వద్ద రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో అధికారులు చివ్వెంల–ఏపూరు మీదుగా ఖమ్మం రోడ్–వరంగల్‌కు భారీ, చిన్నతరహా వాహనాలను మళ్లించారు. చింతలపాలెం–దొండపాడు వద్ద 100 మీటర్ల వరకు రహదారిపై కోత పడటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. యాదాద్రి జిల్లాలోని రుద్రవెల్లి- జూలూరు, బొల్లేపల్లి -సంగెం గ్రామాల మధ్య వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిపివేశారు. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోని 12 గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మూడు జిల్లాల్లో 30 ఇళ్లు పూర్తిగా, 53 ఇళ్లు పాక్షికంగా నేలకూలాయని కలెక్టరేట్‌లోని విపత్తు, స్పందనల శాఖలోని కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 ప్రాంతాల్లో 13.46 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. 25 చోట్ల రహదారులపై అంతరాయం ఏర్పడింది. మొత్తం రూ.70.46 లక్షల నిధులతో మరమ్మతులు చేసేందుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు తాత్కాలిక అంచనాలు ప్రతిపాదించి.. సుమారు రూ.20.8 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదించారు.



## రక్తదానం చేసిన నేలకోండపల్లి అమృత వైద్య కేంద్రం వైద్యుడు రాంబాబు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండలంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో నేలకొండపల్లి అమృత ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యుడు రాంబాబు రక్తదానం చేసినాడు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రక్తదానం చేయడం నాకు ఆనందంగా ఉందని నాతోటి పాల్గొన్న గ్రామిన వైద్యులకు కూడా అభినందనలు తెలిపారు.. చేసిన రక్తదానం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుందని అనేక రకాల రోగులు రక్తం దొరకక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి ఎస్సై పి. సంతోష్ రక్తదానం చేసిన గ్రామీణ వైద్యుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సహాయ సంఘం అధ్యక్షులు మోహిన్ మియా, తనిషా, మల్లయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్, చంద్రావు తదితరులు పాల్గొన్నారు.

## జడ లక్ష్మి రాజు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపిన తోటి ఉద్యోగులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కండక్టర్గా తన ఉగ్యోగ జీవితం ను ప్రారంభించి కండక్టర్ గా తన కృషి నిబద్ధత నిస్వార్థ సేవతో 30 ఏళ్ల పాటు ప్రయాణికులకు సంస్థకు సేవలందించిన జడ లక్ష్మి రాజు 2025 అక్టోబర్ 31వ తేదీన తన సేవా ప్రస్థానాన్ని ఖమ్మం డిపో నందు ముగించి పదవీ విరమణ పొందుతుయు న్నారు మూడు దశాబ్దాల సేవలో ఆయన చూపిన క్రమశిక్షణ విధేయత సహచరుల పట్ల మమకారం ప్రయాణికుల పట్ల ఆప్యాయత సంస్థకు ఒక ఆదర్శంగా నిలిచాయి ఆయన ప్రతి రోజూ సేవను ధర్మంగా భావించి తన కర్తవ్యాన్ని ప్రామాణికంగా నిర్వహించారు.సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ఈ సీనియర్ ఉద్యోగి జడ లక్ష్మి రాజు కి రిటైర్మెంట్ సందర్భంగా తోటి ఉద్యోగులు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు పంచాయతీలోని బిజెపి,బిఆర్ఎస్, పార్టీల నుండి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోరం పగిడయ్య, ఆత్మకూరి ప్రవీణ్,ఆత్మకూరి రాఘవ రాజు, గొబ్బూరి రఘుపతి, కుర్సం రాంబాబు,తునూరి జయరాజు లను ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరిన పలు కుటుంబాలకు,పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు, మండల మాజీ అధ్యక్షులు దాట్ల సీతారామరాజు,సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాథరాజు, నాయకులు ఎస్కే కాజావలి,కాకర్లపూడి కళ్యాణ్, నల్లగాసి రమేష్,కురుసం కృష్ణమూర్తి, బంధం కృష్ణ,వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపు నల్లేరుపై నడక

### యువజన కాంగ్రెస్ నాయకులు చెన్ను వెంకటరమణ యాదవ్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు పై నడకేనని పాలేరు యువజన కాంగ్రెస్ నాయకులు చెన్ను వెంకటరమణ యాదవ్ అన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బొరబండ,ఎర్రగడ్డ,యూసఫ్ గూడ,వెంగళరావు నగర్,ఓం నగర్ తదితర ప్రాంతాల్లో నవీన్ యాదవ్ గెలుపు కోసం శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్ యాదవ్ గెలుపు చాలా అవసరం ఉందని తెలిపారు.మూడు దఫాలుగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా అభివృద్ధి మాత్రం జరుగలేదని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని,అందుకే ఉచిత బియ్యం,మహిళలకి ఉచిత బస్ ప్రయాణం,500 కే గ్యాస్,ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.ప్రతిపక్ష బిఆర్ఎస్,బిజెపి లు లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని అనైతిక పొత్తుకు తెరలేపారని,అయినప్పటికీ నవీన్ యాదవ్ గెలుపు ను ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మేకల మల్లిబాబు యాదవ్,పల్లెబోయిన శ్రీను, పాల్గొన్నారు.

## 12,911 టన్నుల తడిసిన ధాన్యం బాయిల్డ్ మిల్లులకు కేటాయింపు

### నాలుగు జిల్లాలపై పౌరసరఫరాల సంస్థ నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబర్ 31:** తుపాను ప్రభావంతో కొనుగోలు కేంద్రాల్లో వర్షాలకు తడిసిన ధాన్యంలో 12,911 టన్నులు బాయిల్డ్ మిల్లులకు కేటాయిస్తూ పౌరసరఫరాల సంస్థ నిర్ణయం తీసుకుంది. ఇందులో 7,411 టన్నులు ఆయా మిల్లులకు శుక్రవారం తరలించారు. ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలంటే తేమ 17% దాటకూడదు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండగా సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ నాలుగు జిల్లాల్లో నష్టం తీవ్రంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో తూకం వేసినవాటితోపాటు వేయని ధాన్యం కలిపి 526 టన్నుల్ని బాయిల్డ్‌మిల్లులకు కేటాయించారు. అందులో ఇప్పటికే 400 టన్నులను మిల్లులకు తరలించారు.

## 24 సర్కిల్లో జోరుగా

# అక్రమ నిర్మాణాలు..?

- అధికారుల అత్యాశే అందుకు కారణమా..! : స్థానికులు
- ఫిర్యాదులు ఎప్పటికీ బుట్ట దాకలేనా..?



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి సర్కిల్ ప్రాంతం లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అక్రమ నిర్మాణాలు నిర్మించడంలో బిల్డర్లు నేనంటే నేనని పోటీపడి మరి నిర్మిస్తున్నారట ఒకరేమో రెండు ఫ్లోర్ల అనుమతులు తీసుకొని మరో రెండు ఫ్లోర్లు అదనంగా వేస్తే మరికొందరు ఎటువంటి అనుమతులు లేకుండా ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారు. అందులోనూ కొందరు రెసిడెన్షియల్ పరిమితులు తీసుకొని నిర్మిస్తుంటే మరికొందరు అదే రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని లేకుంటే ఏ పరిమితి లేకుండానే కమర్షియల్ నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వానికి పన్ను ఎగవేసి ప్రభుత్వ అధికారుల జేబులు నింపుతున్నారని స్థానికంగా వినికిడి. ఉదాహరణకి శాతవాహన కాలనీ, ఇంద్రా నగర్ కాలనీ, తులసి నగర్ ల లో నిర్మిస్తున్న అక్రమ



నిర్మాణాలను చూపించవచ్చు. సదరు నిర్మాణాలపై పలుమార్లు వార్తలు వచ్చినప్పటికీ ఆయా నిర్మాణదారులు మాత్రం నిండకుండా తొనకదు అనే సామెత లా... 'అధికారులందరికీ జేబులు నిండా నింపాక.. మనకేం కాదు, మన నిర్మాణాలకు వారు ఏమి కానివ్వరు'. అనే దృఢమైన నమ్మకంతో ఉన్నారని వినికిడి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణ ప్రణాళిక విభాగానికి విరుద్ధంగా ఎవరైనా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే చట్టం కచ్చితంగా సదరు నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుందనే విషయాన్ని ప్రజలకు తెలియ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకి బూట్ల పంపిణీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పల్లె బాలల అడుగు తడబడకుండా, ముళ్ళు,రాళ్లు గుచ్చుకోకుండా చదువు దారిలో ముందుకు సాగాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకి బూట్లు పంపిణీ చేస్తున్నారని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు అన్నారు.ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బూట్ల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల చదువు ప్రయాణానికి అండగా నిలిచేందుకు పిఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అందిస్తున్నట్లుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్,సురేష్ నాయక్,వెంపటి రవి,తమ్మినేని నవీన్,



ఏటుకూరి సుధాకర్,అంబటి సుబ్బారావు,కందుకూరి వెంకట నారాయణ,మెండె వెంకటేష్ యాదవ్,గౌస్,వెంకట రమణ, శ్రీదేవి,దివ్య,బోయిన సంగయ్య,వెంపటి సురేష్,శేఖర్ రెడ్డి, వెంపటి వెంకన్న, శేషు రెడ్డి,సురేష్ రెడ్డి, విజయలక్ష్మి, రాజు, వెంకటేష్,బోయిన సాయి,పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత

### మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి తెలిపారు.స్వచ్ఛ సూర్యాపేట కార్యక్రమం కింద శుక్రవారం ఉదయం స్థానిక 25వ వార్డులో "పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత" నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా పాల్గొని వీధి పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు.ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కల్పించేందుకు అధికారులందరినీ ప్రజలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణం శుభ్రంగా ఉండాలంటే ప్రజలు కూడా చురుకుగా ముందుకు రావాలని, "ప్రతి ఇంటి ముందే పరిశుభ్రత ప్రారంభమవుతుందని అన్నారు.చెత్తను రోడ్లపై వేయకుండా తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడం ద్వారా పట్టణం అందంగా, ఆరోగ్యవంతంగా ఉంటుంది" అన్నారు.పట్టణంలోని ప్రతి వార్డులో స్వచ్ఛత,పచ్చదనం,నీటి పరిరక్షణ వంటి అంశాలపై మున్సిపల్ శాఖ క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శ్రమదానం కేవలం ఒక కార్యక్రమం కాదని, అది "స్వచ్ఛ సూర్యాపేట" లక్ష్యానికి మొదటి అడుగు అని పేర్కొన్నారు.పట్టణం అందంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు కలసి రహదారుల పక్కన ఉన్న చెత్తను,కలుపు మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి సోమయ్య ,సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ , ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ ,టీఎంసీ శ్వేత సిబ్బంది, వార్డు అధికారులు,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా మున్సిపల్ కమిషనర్ పిలుపుకు స్పందించి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని శుభ్రతకు తమ వంతు సహకారం అందించారు.

## రక్తదానం చేసి ప్రాణధాతలు కావాలి

- ఖమ్మం సిపి సునీల్ దత్
- పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం




**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రక్తానికి కులం,మతం లేదని మానవత్వమున్న స్త్రీ, పురుషులు ఎవ్వరైనా రక్తదానం చేయడానికి అర్హులేనని రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని ఖమ్మం సిపి సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం రూరల్ పోలీస్ సబ్ డివిజన్ వారి ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవం-ఇలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవా\్రం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రక్తపు బొట్టు విలువైనదని,రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని,ఎవరో ఒకరు దానం%శ్రీ% చేయడం వల్లే పొందవచ్చని తెలిపారు.బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిలువలు లేక తలసేమియా,సికిల్ సెల్,డెంగ్యూ,గర్భిణీలు,రోడ్డు ప్రమాద బాధితులకి సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని,మనం ఇచ్చే కొద్దిపాటి రక్తం ఎంతో మంది అభాగ్యులు జీవితాల్లో వెలుగు నింపుతుందని వెల్లడించారు.రక్తం ఇస్తే బలహీనమైపోతామేమోనన్న అపోహను వీడి రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని సునీల్ దత్ కోరారు.మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కారేపల్లి, కామేపల్లి, కూసుమంచి, ముదిగొండ, తిరుమలాయపాలెం, రూరల్, నేలకొండపల్లి మండలాల నుండి సుమారుగా 1300 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ముదిగొండ సీఐ ఓ.మురళి, ఎస్సైలు పి.సంతోష్, కూచిపూడి జగదీష్, నాగరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

### పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్

**వాజేడు, రాజముద్ర న్యూస్:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా" జాతీయ ఐక్యత దినోత్సవం"ను పురస్కరించుకొని, శుక్రవారం పేరూరు గ్రామంలో ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్, సివిల్, సిఆర్పిఎఫ్, సిబ్బంది ఆధ్వర్యంలో జెండా ఊపి రన్ ఫర్ యూనిట్ 2 కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చంద్రుపట్ల,టేకులగూడెం, కృష్ణాపురం,పేరూరు, రాంపురం,ధర్మవరం,గ్రామ యువత 2 కే రన్ లో పాల్గొన్నారు.గెలుపొందిన వారికి తగు బహుమతి అందజేశారు. ఎస్సై కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత ఐక్యతకు ప్రతీక అని, భారతదేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి, భారత నిర్మాణకర్త ఉక్కు మనిషి అని,ఆయన స్ఫూర్తితో యువత, సామరస్యం,దేశభక్తి, సమైక్యత భావం పట్ల అవగాహన కలిగి ఉండాలని, అన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్,సిఆర్పిఎఫ్, యువత,పాల్గొన్నారు.



## భారతదేశ ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

### సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ హాఫీజుద్దీన్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారతదేశ తొలి మహిళ ప్రధానిగా అనేక సంస్కరణలను అమలు చేసి పేదల అభ్యున్నతికి కృషి చేసిన ధీర వనిత ఇందిరా గాంధీ అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ హాఫీజుద్దీన్ అన్నారు.కూసుమంచి మండల కేంద్రంలోని మినీ గాంధీ భవన్ లో శుక్రవారం దివంగత ప్రధాని ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందిరా గాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడతూ గరిభి హటావో నినాదంతో పేదలకు కనీస అవసరాలైన కూడు,గూడు కల్పించి,రాజ భరణాలు రద్దు చేసి బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాకే దక్కిందన్నారు.ఉక్కు మహిళగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివని,ఆమె ఆశయాలు కొనసాగాలంటే రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన అవసరం ఉందని హాఫీజుద్దిన్ తెలిపారు.తొలుత శాసనసభ్యుని క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇందిరాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇంచార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,సిడిసి చైర్మన్ యరబొలు సూర్యనారాయణ రెడ్డి,కొరివి వెంకటరత్నం,బెల్లంకొండ వెంకన్న,బానోత్ పీర్యా నాయక్,బానోత్ బొంగా నాయక్,సురేందర్ రెడ్డి,శివాలయం చైర్మన్ రేలా ప్రదీప్ రెడ్డి,గుండా భూపాల్ రెడ్డి,బుచ్చి రెడ్డి,శివారెడ్డి,లింగా రెడ్డి,కందుల వెంకన్న,బెల్లంకొండ కిరణ్, షేక్ నాగుల్ మీరా,షేక్ హుస్సేన్,దామల్ల పాపారావు,తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయలత



**సూర్యాపేట:రాజముద్ర న్యూస్ :** నవంబర్ మూడు,నాలుగు తేదీలలో సూర్యాపేట మెడికల్ కళాశాలలో నిర్వహించే మెడికల్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ జయలత శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఈ మెడికల్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి సూర్యాపేటలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల,కళాశాలల విద్యార్థులు హాజరుకావాలని ఆమె ఆహ్వానించారు. మెడికల్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,ఎస్పీ నరసింహ కొత్తపల్లిలు హాజరవుతారని ఆమె వెల్లడించారు. సోమవారం,మంగళవారం ఉదయం 9:30 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎగ్జిబిషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రాక్టికల్ వర్క్ షాపులు, ప్రాథమిక చికిత్స,సూచరింగ్,శరీర నిర్మాణ నమూనాలపై శిక్షణ,క్లినికల్ ప్రదర్శనలు,వివిధ వైద్య విభాగాలైన సర్జరీ,అనాటమీ, ఫాథాలజీ ద్వారా ప్రత్యక్ష ప్రదర్శన ఉంటాయని తెలిపారు. దీంతోపాటు వైద్య రంగాల నిపుణుల ఉపన్యాసాలు, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లతో ముఖాముఖి ఉంటుందన్నారు. అంతేకాకుండా వివిధ ల్యాబ్ ల సందర్శన,అధునాతన ప్రయోగశాలలు, మ్యూజియం పరిశీలన ఉంటుందని చెప్పారు. కెరీర్ గైడెన్స్ పై అవగాహన కొరకు నీట్, యూజీ పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యే విధానం,వైద్య విద్య కెరీర్ అవకాశాలపై మార్గదర్శకత్వం ఉంటుందని వివరించారు.వైద్య రంగం గురించి విపులంగా, వివరంగా తెలుసుకునే సదవకాశం ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని సద్వినియోగ చేసుకోవాలని,మరిన్ని వివరాల కోసం 6300 177 677 నెంబర్ లో సంప్రదించాలని



## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అఖిలపక్ష-రైతు కూలీ సంఘం నాయకులు

**తిరుమలాయపాలెం :** గత మూడు రోజులుగా మొంథా తుఫాన్ తో భారీగా కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా వరి, పత్తి మిర్చి తదితర రైతుల పంటలతో పాటు సాధారణ, పేద ప్రజలకు ఇండ్లు, ఆస్తి నష్టం జరిగింది, ప్రభుత్వం వెంటనే నష్టపోయిన పంటలను, జరిగిన నష్టాన్ని గుర్తించి తగిన నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అఖిల భారత రైతు –కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ మాట్లాడుతు పత్తి, వరి పంటలు మార్కెట్ కు వస్తున్న తరుణంలోనే తుఫాన్ చాలా నష్టం కలిగించి ప్రకృతి వైపరిత్యంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు తీవ్రంగా నష్టపోయాయని, ఐకేపీ కేంద్రల ల్లో పోసిన దాన్యం తడిసి మొలకలేత్తాయని అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోలే పొంగు నాగయ్య మాట్లాడుతు ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి మద్దతు ధర చెల్లించాలని అన్నారు. మొంథా తుఫాన్ గాలి వానతో చేతికోచ్చిన పంటలు నేల మట్టం అయ్యాయని ఆయన తెలిపారు. అధికారులు నిర్వాసితులను గుర్తించి ఆదుకోవాలని పత్తికి ఎకరానికి నలభై వెయ్యిలు,వరికి ఎకరానికి 50వేల రూపాయలు మిర్చికి ఎకరానికి లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పాముల మోహన్ రావు, ఎస్.కె సుభాన్, డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, మాగి విజయ్, ఎస్.కె షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



## రెండుదేశాలపై ప్రభావం ఉండొద్దు

**కానీ.. ఆ బిడ్డ గురించే మా బాధ అంతా : సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ :** బిడ్డ సంరక్షణపై భారత్‌కు చెందిన భర్త, రష్యాకు చెందిన భార్య చేస్తోన్న న్యాయ పోరాటంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రష్యా మహిళ ఆచూకీపై ఆ దేశ ఎంబసీ నుంచి తగిన స్పందన రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. "రెండు దేశాల సంబంధాలను ప్రభావితం చేసే ఎలాంటి ఉత్తర్వులను మేం జారీ చేయాలని అనుకోవడం లేదు. ఇది ఒక చిన్నారికి సంబంధించిన కేసు. ఇది చాలా సున్నితమైన అంశం. తన తల్లితో ఉన్నందున ఆ బిడ్డ క్షేమంగా ఉన్నాడని మేం ఆశిస్తున్నాం. ఇది చిన్నారుల అక్రమ రవాణా కేసు కాదని మేం భావిస్తున్నాం" అని కోర్టు వ్యాఖ్యలు చేసింది. అలాగే ఆమె వివరాలను సేకరించేందుకు అధికారులకు రెండు వారాల గడువు ఇచ్చింది. గత విచారణలో కోర్టు స్పందిస్తూ.. "తల్లి లేక తండ్రికి ఇంతవరకు చిన్నారి కస్టడీ అప్పగించలేదు. సుప్రీంకోర్టు కస్టడీ నుంచి ఆ బిడ్డను లాగేసుకుపోయారు" అని తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. తన నుంచి విడిపోయిన రష్యన్ మహిళ వద్ద ఉన్న బిడ్డ సంరక్షణ కోసం భారత్‌కు చెందిన తండ్రి పోరాడుతున్నాడు. గతంలో న్యాయస్థానం ఆదేశాలను ఆమె పట్టించుకోలేదని ఆరోపించారు. జులై 7 నుంచి బిడ్డతోపాటు ఆమె ఆచూకీ తెలియడం లేదని, ఆమెను కోర్టు పరిధి నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. జులై 4న రష్యన్ ఎంబసీ వెనుక ద్వారం నుంచి ఓ దౌత్యాధికారి ఆమెను లోపలికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోందన్నారు. ఆమె సరిహద్దు దాటి నేపాల్‌లోకి ప్రవేశించి.. అక్కడి నుంచి షార్జా మీదుగా రష్యాకు వెళ్లినట్లుగా భావిస్తున్నామని గత విచారణలో కేంద్రం వెల్లడించింది. మాస్కోలోని భారత ఎంబసీ ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా.. రష్యా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని విదేశాంగశాఖ వెల్లడించింది. ఢిల్లీ పోలీసులు ఇదే విషయాన్ని వెల్లడించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించి ఉంటే.. ఆ మహిళ అంత సులువుగా దేశం దాటి వెళ్లగలిగేవారు కాదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆమె జాడ గుర్తించేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే ఆదేశించింది.



## పహల్గాం ఉగ్రవాదులను హతమార్చిన పోలీసులకు పురస్కారాలు

**న్యూఢిల్లీ :** ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా వివిధ ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 1466 మంది పోలీసులకు కేంద్ర హోంశాఖ అత్యుత్తమ పురస్కారాలు ప్రకటించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పోలీసులు సహా కేంద్ర బలగాలను 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్ 2025'కు ఎంపిక చేశారు. వీరిలో పహల్గాం ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్న 40 మంది జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు. పహల్గాం దాడికి తెగబడిన ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత సైన్యం, జమ్మూ పోలీసులు, ఇతర భద్రతా దళాలు సంయుక్తంగా 'ఆపరేషన్ మహాదేవ్' చేపట్టి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇందులో పాల్గొన్న ఐజీ (కశ్మీర్ రేంజ్) వీకే బిర్డీ, సీనియర్ ఎస్పీ (శ్రీనగర్) జీవీ సందీప్ చక్రవర్తితోపాటు జమ్మూకశ్మీర్‌కు చెందిన 19 మంది పోలీసులు హోంశాఖ అవార్డుకు ఎంపికయ్యారు. ఓ డీఐజీ సహా పలువురు ఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుళ్ల వరకు ఈ అవార్డు ఎంపికైన వారిలో ఉన్నారు. 21 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా ఈ మెడల్‌ను తీసుకోనున్నారు.

### తెలుగు రాష్ట్రాల నుంచి..

తెలంగాణకు చెందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు (లక్ష్మణరావు, జాకబ్), ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు (చంద్రబాబు, ఉపేందర్ రావు, తిరుపతి) ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఎస్పీ (అద్నాన్ నయీం అస్మీ), అదనపు ఎస్పీ (భీమా రావు), డీఎస్పీ (ఆర్‌జీ జయసూర్య), ఎస్ఐ (ఎండీ నసీరుల్లా)తోపాటు ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఫణి భూషణ్) ఈ అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. హోంశాఖ పరిధిలో గతంలో ఉన్న వివిధ ప్రతిభా పురస్కారాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం.. 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్'ను 2024లో ప్రవేశపెట్టింది. భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి రోజైన 'ఏక్తా దివస్' సందర్భంగా ఏటా అక్టోబర్ 31న వీటిని ప్రకటిస్తారు. 2025 ఏడాదికి గాను దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఇంటెలిజెన్స్, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 1466 మంది పోలీసు, భద్రతా సిబ్బందిని ఈ మెడల్‌కు ఎంపిక చేశారు.

## కేజ్రీవాల్‌కు మరో శీష్ మహల్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ వినిపించిన 'శీష్ మహల్' పదం మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చండీగఢ్‌లో లగ్జరీ భవనం కేటాయించినట్లు తాజాగా భాజపా ఆరోపణలు చేసింది. ఆ భవనం ఫొటో షేర్ చేసి విమర్శలు చేసింది. "కామన్ మ్యాన్‌గా ప్రచారం చేసుకున్న వ్యక్తికి సంబంధించి మరో శీష్ మహల్ ఇది. ఢిల్లీలోని మహల్ నుంచి ఖాళీ చేసిన తర్వాత.. పంజాబ్ సూపర్ సీఎంగా చలామణి అవుతోన్న అరవింద్ కేజ్రీవాల్ కోసం మరో విలాస భవనాన్ని నిర్మించారు. చండీగఢ్ సెక్టార్2లో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 7 స్టార్ భవనం కేజ్రీవాల్‌కు కేటాయించారు" అని భవనం చిత్రాన్ని భాజపా షేర్ చేసింది. ఈ ఫొటోను ముందుగా ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతీ మాలీవాల్ నెట్టింట్లో పంచుకున్నారు. ఆమె కొంతకాలంగా సొంతపార్టీపై విమర్శలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఢిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా పేర్కొంది. రూ.45 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7- స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ.. తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదని ప్రధాని మోదీ కూడా దుయ్యబట్టిన సంగతి తెలిసిందే. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని దెబ్బతీశాయి. భాజపాకు విజయాన్ని కట్టబెట్టాయి.

# భారత్ బలం ఏంటో తెలిసొచ్చింది

- దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలి
- భారతదేశాన్ని ఏకంచేసి పటేల్ చరిత్ర సృష్టించారు
- వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ప్రధాని నరేంద్రమోడీ





**గాంధీనగర్, అక్టోబర్ 31 :** చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారని, అందుకే ఆయన దేశాన్ని ఏకం చేశారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని మోడీ కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు.స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శనికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం అని అన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల మాదిరిగానే ఏక్తా దివస్‌ను జరుపుకొంటున్నాం. భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విభజన శక్తులకు దూరంగా ఉండాలి. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించింది. నక్సల్స్ ఏరివేత కోసం ఎన్నో ఆపరేషన్స్ చేశాం. నక్సలిజం మూలాలను సమూలంగా పెకిలిస్తాం. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. దానిని నెహ్రూ గౌరవించలేదు. పటేల్, అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది. ఆయన దూరదృష్టిని మరిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్రవాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్రవాదులకు తెలిసింది. దేశ ఐక్యతను బలోపేతం చేసే చర్యలను ప్రోత్సహించాం. ఆయన ఆకాంక్షలను మేం గౌరవించాం. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం అని మోదీ పిలుపునిచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశామని వెల్లడించారు. పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేశారు. ఇందులో సైనిక దళాల కవాతు ఆకట్టుకుంది.

## వలసదారులపై అమెరికా అక్కసు..

**భారత్‌ను నిందిస్తూ యాడ్**



**యూఎస్ :** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాల పై ఆంక్షలు.. ఇలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడు తున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈక్రమంలోనే హెచ్-1బీ వీసాదారులను ఉద్దేశించి ట్రంప్ యంత్రాంగం అక్కసు వెళ్లగక్కింది. ఈమేరకు లేబర్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ వేదికగా ఒక యాడ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీసాను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని నిందించింది. ఆ వీసాదారుల్లో అత్యధికులు భారతీయులే ఉన్నారని ఆక్షేపించింది."హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తోన్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అమెరికా కలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ మా యువత విషయంలో అలా జరగడం లేదు" అని యాడ్‌లో ప్రస్తావించారు. హెచ్-1బీల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని ఒక గ్రాఫ్ రూపంలో వెల్లడించారు. ఈ వీసా విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా..? అని గుర్తించేందుకు 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ఈ సమయంలోనే ఈ యాడ్‌ను పోస్ట్ చేసింది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ యువతతో భర్తీ చేయకుండా చూడటమే దీని ఉద్దేశం. హెచ్-1బీ వీసా విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనం సృష్టించింది. "హెచ్-1బీ వీసా వ్యవస్థ మోసాలతో నిండి ఉంది. అది అమెరికన్ల వేతనాలను తగ్గించింది. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగు పరచాలనుకుంటున్నారు" అని అమెరికా ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తం చేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇక పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ఆయనకు లేఖ కూడా రాశారు. ట్రంప్ నిర్ణయం యూఎస్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైపుణ్యం కలిగిన వలసదారులను కోల్పోవాల్సి ఉంటుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు.


## ఆ కిడ్నాపర్ నాకూ మెసేజ్ చేశాడు

**పిల్లల నిర్బంధం ఘటనపై నటి సంచలన పోస్ట్**



**ముంబయి:** మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఓ యాక్టింగ్ స్టూడియోలో పట్టపగలే చిన్నారులను నిర్బంధించడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై తాజాగా మరాఠీ నటి రుచితా విజయ్ జాదవ్ స్పందిస్తూ సంచలన విషయాలు వెల్లడించారు. పిల్లలను బంధించడానికి రెండ్రోజుల ముందు తాను కూడా ఆ కిడ్నాపర్ రోహిత్ ఆర్యను కలవాల్సి ఉందని ఆమె తెలిపారు. అతడి బారిన పడకుండా తాను త్రుటిలో తప్పించుకున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌స్టాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు. "కొద్ది రోజుల క్రితం రోహిత్ ఆర్య అనే వ్యక్తి ప్రొడ్యూసర్‌గా నాకు పరిచయమయ్యాడు. ఓ ఫిల్మ్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడాలన్నాడు. బంధించడం నేపథ్యంలో సినిమా తీయనున్నట్లు చెప్పాడు. దీంతో కథ వినేందుకు నేను అంగీకరించా. అక్టోబరు 23న అతడు నాకు మెసేజ్ చేసి కథ చెప్పేందుకు అపాయింట్‌మెంట్ కావాలని అడిగాడు. అక్టోబరు 28న కలుస్తానని చెప్పా. అక్టోబరు 27న పవయీ ప్రాంతంలోని తన ఆర్‌ఏ స్టూడియో అడ్రసు, లొకేషన్‌ను నాకు షేర్ చేశాడు. "అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ మీటింగ్‌ను నేను చివరి నిమిషంలో రద్దు చేసుకున్నా. ఈ ఉదయం నేను మీడియాలో అతడి గురించి వార్త చూడగానే వణికిపోయా. రెండు రోజుల క్రితం నేను కలవాల్సిన అదే వ్యక్తి.. ఇలా పిల్లలను బంధించాడని తెలిసి షాక్ అయ్యా. ఆ రోజు ఏదో శక్తి నన్ను కాపాడినట్లు అనిపిస్తోంది. అతడి బారిన పడకుండా నన్ను కాపాడిన భగవంతుడికి, మా కుటుంబసభ్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటా. ఈ ఘటనతో నేనో విషయం తెలుసుకున్నా. కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకునేందుకు ముందు మనం చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. మీరు ఎక్కడికి వెళ్తున్నారు? ఏం చేస్తున్నారనే విషయాలను కుటుంబసభ్యులతో పంచుకోండి" అని నటి రుచితా జాదవ్ రాసుకొచ్చారు. పవయీ ప్రాంతంలోని ఆర్‌ఏ స్టూడియోలో గురువారం మధ్యాహ్నం ఆడిషన్స్ కోసం వచ్చిన పిల్లలను రోహిత్ ఆర్య (50) బంధించాడు. సమాచారం అందుకొన్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకోగా, అదే సమయంలో రోహిత్ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో విడుదల చేశాడు. చర్చల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పోలీసులు మొదటి అంతస్తులోని మరుగుదొడ్డి మార్గంలో నుంచి స్టూడియో లోపలికి ప్రవేశించి బందీలుగా ఉన్న పిల్లలను రక్షించారు. అది చూసిన రోహిత్ ఎయిర్‌గన్‌తో పిల్లలకు హాని తలపెట్టబోగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అతడు మరణించాడు.

## భారత్- అమెరికాల మధ్య కీలక రక్షణ ఒప్పందం



**న్యూఢిల్లీ :** భారత్- అమెరికాల మధ్య సంబంధాలు మరింత బలపడనున్నాయి. ఇరుదేశాల మధ్య శుక్రవారం కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. 10 ఏళ్ల పాటు ఉండే ఈ ఒప్పందం ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, భద్రతా సహకారాన్ని బలోపేతం చేయనుంది. మలేసియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఇక్కడ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్‌లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ ఒప్పందంపై ఇరువురు సంతకాలు చేశారు. 10 ఏళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందని హెగ్సెత్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది ఇరుదేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్తుందన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని పెంచుకుంటామని.. మా రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన రాసుకొచ్చారు. ఈ సమావేశం నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్, హెగ్సెత్‌ల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.



## సెక్స్ కుంభకోణంలో పేరు..

**సోదరుడిని ఇంటి నుంచి బలవంతంగా గెంటేసిన బ్రిటన్ రాజు**

**యూఎస్ :** అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం కేసు పత్రాల్లో ప్రముఖ రాజకీయ నాయకులు, ధనవంతులతో పాటు బ్రిటన్ యువరాజు ఆండ్రూ పేరు కూడా బయటకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తనకున్న రాయల్ టైటిల్‌ను ఇటీవల ఆండ్రూ వదులుకున్నారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బ్రిటన్ రాజు చార్లెస్ తన సోదరుడిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఆండ్రూకు ఉన్న బిరుదులన్నింటినీ తొలగించడంతో పాటు ఆయన్ను బలవంతంగా ఇంటి నుంచి పంపించేసినట్లు తెలుస్తోంది. బకింగ్‌హామ్ ప్యాలెస్ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొంది. దివంగత రాణి ఎలిజబెత్ రెండో కుమారుడు, చార్లెస్ తమ్ముడు ఆండ్రూ. జెఫ్రీ ఎప్‌స్టైన్ సెక్స్ కుంభకోణం కేసు పత్రాల్లో పేరు వెలువడినప్పటి నుంచి ఆండ్రూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటు న్నారు. ఇటీవల తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకున్నారు. ఈ క్రమంలోనే ప్రిన్స్ ఆండ్రూకు ఉన్న అన్ని రాజ బిరుదులు, గౌరవాలు, అధికారాలను రాజు చార్లెస్ తొలగించారని బకింగ్‌హామ్ ప్యాలెస్ పేర్కొంది. ఆయన ప్రస్తుతం లీజుకు తీసుకుని ఉంటున్న లండన్‌లోని విండ్సర్ ఎస్టేట్‌ను కూడా ఖాళీ చేయాలని అధికారిక నోటీసులు పంపినట్లు వెల్లడించింది. దీంతో ఆండ్రూ తూర్పు ఇంగ్లాండ్‌లోని సాండ్రిగ్‌హామ్ ప్రైవేటు ఎస్టేట్‌లోకి మారతారని తెలిపింది. తనపై వచ్చిన ఆరోపణలను ఆండ్రూ పలుమార్లు తిరస్కరించిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. అయినా ఈ చర్యలు అనివార్యమని రాజు భావిస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రాజు చార్లెస్, రాణి కెమిల్లా కుంభకోణంలోని బాధితుల వైపే ఉంటారని స్పష్టం చేసింది. ఎప్‌స్టైన్ సెక్స్ కుంభకోణం అగ్రరాజ్యాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన వర్జినియా గ్రీఫీ అనే బాధితురాలు ప్రిన్స్ ఆండ్రూపై లైంగిక ఆరోపణలు చేసింది. 17 ఏళ్ల వయసులో యువరాజు తనను మూడుసార్లు అనుభవించాడని ఆమె పేర్కొంది. అయితే, ఈ ఆరోపణలను ఆండ్రూ ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూ వచ్చాడు. ఇటీవల గ్రీఫీ రాసిన 'నోబడీస్ గర్ల్' అనే పుస్తకం విడుదల నేపథ్యంలో ఆండ్రూ పేరు మరోసారి చర్చకు వచ్చింది. ఈ క్రమంలోనే తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

## ఆరెస్సెస్‌ను నిషేధించాల్సిందే..

**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ :** దేశంలో ఎక్కువగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తడానికి భాజపా-ఆరెస్సెస్ కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ క్రమంలో ఆరెస్సెస్‌ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ చేసిన విమర్శలను ఖర్గే తిప్పికొట్టారు. 1948లో మహాత్మా గాంధీ హత్య తర్వాత ఆరెస్సెస్‌ను విమర్శిస్తూ పటేల్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ చీఫ్ ఉదహరించారు. ఉక్కు మనిషి సర్దార్ పటేల్, ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గొప్ప నేతలని ఖర్గే పేర్కొన్నారు. వారు దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతను కాపాడేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌పై నిషేధం వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణాన్ని ఆరెస్సెస్ సృష్టించిందని మండిపడ్డారు. ఇదే విషయాన్ని పేర్కొంటూ నాటి హోంమంత్రి పటేల్.. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి లేఖ రాశారని గుర్తుచేశారు. భారత తొలి ప్రధాని నెహ్రూ, సర్దార్ పటేల్‌ల మధ్య గొప్ప సంబంధాలు ఉన్నప్పటికీ.. వారి మధ్య చీలిక తెచ్చేందుకు నిత్యం ప్రయత్నించేవారని దుయ్యబట్టారు. దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్‌ను నెహ్రూ ప్రశంసించారని, పటేల్ కూడా నెహ్రూను దేశానికి ఆదర్శంగా అభివర్ణించారని పేర్కొన్నారు. కశ్మీర్ మొత్తాన్ని దేశంలో కలపాలని పటేల్ కోరుకున్నారని, కానీ.. నాటి ప్రధాని నెహ్రూ ఆ ప్రయత్నాలను జరగనివ్వలేదంటూ ప్రధాని మోదీ ఆరోపించడంపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. అయితే, ఖర్గే వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. దశాబ్దాలపాటు పటేల్ చేసిన సేవలను కాంగ్రెస్ విస్మరించిందని పేర్కొంది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

## 460 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్


దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పెట్టుబడిదారులు అమెరికా ఫెడ్ రిజర్వ్ రేట్లపై అప్రమత్తత పాటించడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ తదితర అంశాలు.. దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపించాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు తర్వాతి గంటల్లో ఒత్తిడికి లోనై పడిపోయాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, మెటల్, పవర్ రంగాల్లో నష్టాలు నమోదయ్యాయి. సెన్సెక్స్ 460 పాయింట్ల మేర క్షీణించగా.. నిఫ్టీ 150 పాయింట్లకు పైగా తగ్గింది. సెన్సెక్స్ ఈ ఉదయం 84,379.79 పాయింట్ల (క్రితం ముగింపు 84,404.46) వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 84,712.79 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 465.75 పాయింట్ల నష్టంతో 83,938.71 వద్ద స్థిర పడింది. నిఫ్టీ కూడా 155.75 పాయింట్లు నష్టపోయి 25,722.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో ఎటెర్నల్, ఎన్‌టీపీసీ, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, ఎల్‌అండ్‌టీ, టీసీఎస్, ఐటీసీ, ఎస్‌బీఐఎన్ లాభపడ్డాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 88.77గా ఉంది.






## ఏడేళ్ల క్రితం బుక్ చేసిన
# కారు ఇంకా రాలేదు

### టెస్లాపై శామ్ ఆల్టమన్ పోస్ట్



తాను ఏడేళ్ల క్రితం టెస్లా కారును బుక్ చేసుకున్నానని, అది ఇంకా డెలివరీ కాలేదని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. బుకింగ్ అప్పుడు చెల్లించిన 50వేల డాలర్లను రీఫండ్ చేయాలని కోరుతూ కొన్ని ఈమెయిల్ స్క్రీన్‌షాట్లను షేర్ చేశారు. ఆల్టమన్ 2018లో టెస్లా కారును బుక్ చేసుకున్నారు. తొలి స్క్రీన్‌షాట్ ఆ విషయాన్ని నిర్ధరిస్తోంది. ఏడేళ్ల తర్వాత కూడా కారు డెలివరీ కాకపోవ డంతో బుకింగ్ కోసం ఇచ్చిన 50వేల డాలర్లను రీఫండ్ చేయమంటూ టెస్లా సంస్థకు ఈ సంవత్సరం ఆయన మెయిల్ చేశారు. ఆ వివరాలను తన పోస్టులో షేర్ చేశారు. బుకింగ్ నిర్ధరించిన మెయిల్ ఇప్పుడు అందుబాటులో లేదనే సమాధానం వచ్చిందని ఆయన రాసుకొచ్చారు. “కారు కోసం నేను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూశాను. ఆలస్యాలను అర్థం చేసుకోగలను. కానీ 7.5 సంవత్సరాలు అంటే చాలా ఎక్కువ” అని అసహనం వ్యక్తంచేశారు. ఇది వెంటనే వైరల్‌గా మారింది. ఏ కారు మోడల్‌ను బుక్ చేశారో మాత్రం ఆల్టమన్ వెల్లడించలేదు. అయితే అది టెస్లా రోడ్‌స్టర్ కావొచ్చని తెలుస్తోంది. ఈ కారు మోడల్ ఉత్పత్తి 2020లో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ తర్వాత చాలాసార్లు వాయిదా పడింది. “ఆ వెర్షన్‌పై పనిచేస్తున్నాం” అని 2024లో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ తన ఇన్వెస్టర్లకు తెలిపారు. ఈ ఏడాది చివర్లో ఈ మోడల్ విడుదల కావొచ్చని తెలుస్తోంది. కాగా.. ఆల్టమన్ పోస్ట్‌పై టెస్లా నుంచి స్పందన రావాల్సి ఉంది.

## భారత్‌లో టెస్లా, స్టార్‌లింక్
# నియామకాలు షురూ




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలందించే స్టార్‌లింక్ దేశీయంగా ఉద్యోగ నియామకాలు ప్రారంభించాయి. ముంబయి, దిల్లీ, పుణెలోని పనిచేసేందుకు టెస్లా ప్రకటన ఇవ్వగా.. త్వరలో వాణిజ్య సేవలందించేందుకు సిద్ధమ వుతున్న స్టార్‌లింక్ కూడా బెంగళూరు కేంద్రంగా పని చేసేందుకు నియామకాలు మొదలుపెట్టింది.

### టెస్లాలో 34 మంది

దేశీయంగా ఈ ఏడాది మోడల్ ‘వై’తో విక్రయాలు ప్రారంభించిన టెస్లా.. తాజాగా 34 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రకటన ఇచ్చింది. వీరు ముంబయి, దిల్లీ, పుణె కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుంది. ఇందులో దేశీయంగా ఆటోపైలట్ మోడ్‌ను అభివృద్ధి చేసేందుకు వెహికల్ ఆపరేటర్ పోస్ట్ కూడా ఉంది. టెస్లా కెరీర్ పేజీలో ఆయా ఉద్యోగాలను లిస్ట్ చేసింది. సప్లై చైన్‌బీ ఇంజినీరింగ్%ఽ% ఐటీబీ సేల్స్, కస్టమర్ సపోర్ట్‌బీ ఏఐ, రోబోటిక్స్‌బీ వెహికల్ సర్వీసెస్‌బీ ఆపరేషన్స్ అండ్ బిజినెస్ సపోర్ట్‌బీ ఛార్జింగ్‌బీ హెచ్ఆర్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనుంది. టెస్లా కెరీర్స్ లేదా ఇతర జాబ్ పోర్టల్ల ద్వారా ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివిధ దశల్లో వడపోత అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టనున్నారు.

**స్టార్‌లింక్‌లో..** దేశంలో తక్కువ లేటెన్సీ కలిగిన బ్రాడ్‌బ్యాండ్ సేవలను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్న స్పేస్‌ఎక్స్ అనుబంధ స్టార్‌లింక్ కూడా నియామక ప్రక్రియను చేపట్టింది. తొలిదశ నియామక ప్రక్రియలో భాగంగా ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వాని స్తోంది. అకౌంటింగ్ మేనేజర్, పేమెంట్ మేనేజర్, సీనియర్ ట్రెజరీ అసిస్ట్, ట్యాక్స్ మేనేజర్ వంటి ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు స్పేస్‌ఎక్స్ తన కెరీర్ పేజీలో పేర్కొంది. బెంగళూరులో వీరంతా పని చేయాల్సి ఉంటుంది. మ-రోవైపు స్టార్‌లింక్ ఎర్త్ స్టేషన్ల ఏర్పాటుకు యోచిస్తోంది. ప్రభుత్వం నుంచి కీలక అనుమతులు లభిస్తే ఈ ఏడాది ఆఖర్లో లేదంటే 2026 ప్రారంభంలో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించే లక్ష్యంతో ముందుకెళ్తోంది.




# అంత బరువైన బ్యాటా

### జెమీమాను చూసి ధోనీ ఆశ్చర్యపడిన వేళ..

మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీలో సంచలన ఇన్నింగ్స్‌తో టీమిండియాను ఫైనల్‌కు చేర్చిన జెమీమా రోడ్రిగ్స్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆమె పోరాటం అద్భుతం అంటూ దిగ్గజ క్రికెటర్లు మెచ్చుకుంటున్నారు. ఈ సమయంలో జెమీకి సంబంధించి ఓ పాత వీడియో వైరల్ అవుతోంది. అందులో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీతో జరిపిన సంభాషణను జెమీమా పంచుకుంది. 'మీరు ఎప్పుడైనా ధోనీతో మాట్లాడారా? ఆయన ఎలా ఉంటారు?' అని వ్యాఖ్యాత జెమీమాను అడిగారు. దీనికి ఆమె బదులిస్తూ.. 'ఒకసారి ధోనీ సరసన కలిశాను. అప్పుడు నా బ్యాట్ బరువెంత అని ఆయన అడిగారు. 1200 గ్రాములని చెప్పాను. నాకంటే బరువైన బ్యాట్ ఉపయోగిస్తున్నావే అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన ఎంతో ఒదిగి ఉండే వ్యక్తి. ఆయన చుట్టూ ఏదో ప్రత్యేక శక్తి ఉన్నట్లు అనిపిస్తుంది" అని తెలిపింది. "మరోసారి న్యూజిలాండ్‌లో మేమంతా డిన్నర్ చేస్తున్నప్పుడు ధోనీ అక్కడికి వచ్చారు. ఆ వెంటనే అక్కడి వాతావరణం అంతా మారిపోయింది. అప్పుడు కూడా ఆయన చాలా సింపుల్‌గా ఉన్నారు. ధోనీతో మాట్లాడుతుంటే కూడా చాలా కంఫర్టబుల్‌గా అనిపిస్తుంది" అని జెమీమా నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ ప్రపంచకప్ లో తొలి నాలుగు మ్యాచ్‌ల్లో రెండుసార్లు డకౌట్ అయిన జెమీమా.. మరో రెండు మ్యాచ్‌ల్లో చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేదు. దీంతో ఆమెను పక్కన పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే న్యూజిలాండ్‌తో జరిగిన కీలక పోరుతో మళ్లీ జట్టులోకి వచ్చిన రోడ్రిగ్స్ 55 బంతుల్లో 76 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఇక సెమీస్‌లో భారీ శతకంతో జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది.



# రిషబ్ పంత్ దారుణంగా విఫలం

ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో అద్భుతంగా రాణించిన రిషబ్ పంత్ గాయంతో రెస్ట్ మోడ్‌లోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఇండియా ఏ కెప్టెన్‌గా రీఎంట్రీ ఇచ్చిన రిషబ్ పంత్.. దక్షిణాఫ్రికా ఏతో జరిగిన తొలి అనధికారిక మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. అంటే, 99 రోజుల తర్వాత తిరిగి వచ్చిన పంత్ కేవలం 20 బంతుల్లోనే పెవిలియన్ చేరాడు. ఓపెనర్ ఆయుష్ మాత్రే అర్ధ శతకం మాత్రమే చేయగలిగాడు. మరే ఇతర బ్యాట్స్‌మెన్ కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేకోయారు. ఇది పర్యాటక జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 75 పరుగుల ఆధిక్యాన్ని ఇచ్చింది. ఇంగ్లాండ్‌తో జరిగిన నాల్గవ టెస్ట్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు టీమ్ ఇండియా వెటరన్ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ గాయపడ్డాడు. ఆ తర్వాత దాదాపు మూడు నెలలు ఆటకు దూరంగా ఉన్నాడు. అక్టోబర్ 30న బెంగళూరులో ప్రారంభమైన దక్షిణాఫ్రికా ఏతో జరిగిన మొదటి అనధికారిక మ్యాచ్‌లో అతను తిరిగి మైదానంలోకి అడుగుపెట్టాడు. దక్షిణాఫ్రికా 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాచ్ రెండో రోజు ఇండియా 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ బాగా రాణిస్తాడని భావించారు. కానీ, అతను 20 బంతుల్లో రెండు ఫోర్లతో సహా 17 పరుగులు మాత్రమే చేసి 234 పరుగుల వద్ద పెవిలియన్ చేరాడు. ఇండియా 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌట్ అయింది. ఆతిథ్య జట్టు తరఫున ఆయుష్ మాత్రే మాత్రమే హాఫ్ సెంచరీ చేశాడు. ఇండియా ఏ ఓపెనర్లు ఆయుష్ మాత్రే , సాయి సుదర్శన్ జట్టుకు అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. వీరు మొదటి వికెట్‌కు 90 పరుగులు జోడించారు. ఈ సమయంలో ఆయుష్ వేగంగా పరుగులు సాధిస్తూ, 76 బంతుల్లో 10 ఫోర్లతో 65 పరుగులు చేశాడు. సాయి సుదర్శన్ 94 బంతుల్లో 3 ఫోర్లతో 32 పరుగులు చేశాడు. ఆయుష్ బదోని 47 బంతుల్లో 5 ఫోర్ల సహాయంతో 38 పరుగులు చేశాడు. ఇతర బ్యాట్స్‌మెన్ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ప్రేనేలన్ సుబ్రాయెన్ 5 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు పడగొట్టాడు. ఇండియా ఏ కెప్టెన్ రిషబ్ పంత్ అద్భుతమైన ఫస్ట్ క్లాస్ రికార్డును కలిగి ఉన్నాడు. ఇండియా ఏ కెప్టెన్ రిషబ్ పంత్ ఇప్పటివరకు 73 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 66 ఇన్నింగ్స్‌లలో, అతను 47.06 సగటుతో 5365 పరుగులు చేశాడు. వాటిలో 13 సెంచరీలు, 27 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రెండవ ఇన్నింగ్స్‌లో అతని నుంచి బలమైన ప్రదర్శన కోసం జట్టు ఆశిస్తుంది.

# రెండో టీ20 ఆసీస్‌దే..

## నాలుగు వికెట్ల తేడాతో గెలుపు







**మెల్‌బోర్న్ :** మెల్‌బోర్న్ వేదికగా టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరిగిన రెండో టీ20లో కంగారూ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 13.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 18.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ తొలి నుంచీ దూకుడుగానే ఆడింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (46, 26 బంతుల్లో, 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు. అతడు ఔట్ కావడానికి ముందు రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. 7.6 ఓవర్‌లో కుల్‌దీప్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (28, 15 బంతుల్లో, 1 ఫోర్) క్రీజులో ఉన్నంత వరకు దూకుడుగానే ఆడాడు. జోస్ ఇంగ్లిస్ (20, 20 బంతుల్లో, 1 ఫోర్) ఫర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్, బుమ్రా తలో రెండు వికెట్లు తీసుకున్నారు. బ్యాటింగ్‌లో రాణించిన హర్షిత్ రాణా.. బౌలింగ్‌లో మాత్రం ప్రభావం చూపించలేకపోయాడు. ఆఖర్లో భారత బౌలర్లు వెంట వెంటనే వికెట్లు తీసుకున్నప్పటికీ ఆసీస్‌ను మాత్రం నిలువరించలేకపోయారు.

### అభిషేక్ శర్మ ఒంటరి పోరాటం..

టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ వేదికగా రెండో టీ20లో తలపడుతున్నాయి. తొలుత టాస్ గెలిచిన ఆసీస్ బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు 18.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో అభిషేక్ శర్మ, హర్షిత్ రాణా మాత్రమే రాణించారు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. ఓపెనర్ అభిషేక్ శర్మ (68, 37 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. హర్షిత్ రాణా (35, 33 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్) చెప్పుకోదగ్గ స్కోర్ చేశాడు. గిల్ (5), సంజు శాంసన్ (2), సూర్యకుమార్ యాదవ్ (1), తిలక్ వర్మ (0), అక్షర్ పటేల్ (7), శివమ్ దూబె (4) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 3, జేవియర్ బ్రేట్‌లెట్, నాథన్ ఎల్లిస్ తలో 2, మార్కస్ స్టాయినిస్ 1 వికెట్ తీసుకున్నారు.

# వరల్డ్ కప్ గెలిస్తే.. ఆమెతో కలిసి పాడతా

### ఫ్యాన్స్‌కు గావస్కర్ ప్రామిస్



మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమిండియా దూసుకెళ్లింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్ తుది పోరుకు అర్హత సాధించింది. ఆదివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభిమానులకు ఓ హామీ ఇచ్చారు. సెమీస్‌లో అజేయంగా సెంచరీ చేసిన జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి పాట పాడతానని వెల్లడించాడు. అయితే, జెమీమా అందుకు అంగీకరిస్తేనేనని స్పష్టంచేశాడు. ఇంతకు ముందు భారత పురుషుల జట్టు టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు మైదానంలోనే డ్యాన్స్ చేసిన సంగతి తెలిసిందే. "ఒకవేళ భారత వన్డే ప్రపంచ కప్‌ను గెలిస్తే.. నేను జెమీమాతో కలిసి పాట పాడుతా. ఆమె గిటార్ వాయిస్తుంటే నేను గాయకుడిగా మారతా. మేమిద్దరం కొన్నాళ్ల కిందట బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నాం. అక్కడ బ్యాండ్ ప్లే అవుతూ ఉంటే మేమిద్దరం జాయిన్ అయ్యాం. జెమీమా గిటార్ ప్లే చేసింది. నేను నా వాయిస్‌తో ఏదో పాడేశా. అందుకే అభిమానులకు హామీ ఇస్తున్నా.. మన జట్టు వరల్డ్ కప్ గెలిస్తే మరోసారి ప్రదర్శన ఇస్తాం. అయితే, ఈ ఓల్డ్‌మ్యాన్‌తో కలిసి ప్లే చేయడం జెమీమాకు ఇష్టమైతేనే సుమా.." అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. 2024లో బీసీసీఐ ఏర్పాటుచేసిన అవార్డుల కార్యక్రమంలో జెమీమా రోడ్రిగ్స్ గిటార్‌ను ప్లే చేసి అలరించింది. అక్కడి స్టేజ్ పైకి వెళ్లిన సునీల్ గావస్కర్ తన గానంతో క్రికెటర్లను ఆకట్టుకున్నారు.

## ఒకట్రెండు రోజుల్లో
# ఆసియా కప్ ట్రోఫీ భారత్‌కు.. : బీసీసీఐ

ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ నఖ్వీ ఒకటి లేదా రెండు రోజుల్లో ఆసియా కప్ ట్రోఫీని భారత్‌కు అప్పగించే అవకాశముందని బీసీసీఐ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించి ట్రోఫీని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే దాదాపు నెలరోజులు గడుస్తున్నా.. ఇంకా ట్రోఫీ, మెడల్స్ అందించకపోవడంపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబర్ 4న ఐసీసీ త్రైమాసిక సమావేశం జరగనుంది. ఈలోగా నఖ్వీ.. ఆ ట్రోఫీని భారత్‌కు అప్పగించాలని, లేకపోతే ఈ విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకువెళతామని ఆయన హెచ్చరించారు. 'దాదాపు నెల గడుస్తున్నా.. ఇప్పటికీ ఆసియా ట్రోఫీని మాకు అందించలేదు. ఇది సరికాదు' అని సైకియా ఓ న్యూస్ ఏజెన్సీతో అన్నారు. అలాగే ట్రోఫీ విషయమై ఏసీసీ లేఖ పంపిన విషయాన్నీ ధ్రువీకరించారు. అయితే దానికి బదులుగా నఖ్వీ.. ఏసీసీ కార్యాలయంలోనే ట్రోఫీని తీసుకోవాలని బదులిచ్చినట్లు తెలిపారు. 'మేం ఏసీసీ ఛైర్మన్‌కు ఆసియా కప్ ట్రోఫీ విషయమై లేఖ పంపాం. అయినా పరిస్థితిలో ఏ మార్పూ రాలేదు. ట్రోఫీ ఇప్పటికీ వారి స్వాధీనంలోనే ఉంది. ఒకట్రెండు రోజుల్లో తప్పకుండా అది ముంబయిలోని బీసీసీఐ కార్యాలయానికి వస్తుంది' అని సైకియా ఆశాభావం వ్యక్తం చేశారు.




# రూ.10వేల కోట్లు ఇవ్వండి

### టాటా సన్స్‌ను అభ్యర్థించిన ఎయిరిండియా

అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఎయిరిండియా సంస్థకు గట్టి దెబ్బ తగిలింది. దీని నుంచి బయటపడేందుకు రూ.10 వేల కోట్లు ఆర్థిక సాయం చేయాలని టాటా సన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ను ఎయిరిండియా అడిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఎయిరిండియాలో టాటా గ్రూప్‌కు 74.9 శాతం వాటా ఉంది. మిగిలిన వాటా సింగపూర్ ఎయిర్‌లైన్స్ కలిగిఉంది. విమాన భద్రత, ఇంజినీరింగ్, నిర్వహణ వ్యవస్థలను సరిచేయడంతో పాటు సేవలను మెరుగుపరుచుకునేందుకు ఈ నిధులు కావాలని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. దీనిపై చర్చలు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ నిధులు వడ్డీ లేని రుణాలుగా లేదా పెట్టుబడుల రూపంలో ఉండొచ్చని తెలుస్తోంది. ఈ కథనంపై ఎయిరిండియా గానీ, టాటా సన్స్ గానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, ఈ కథనంపై సింగపూర్ ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. ఎయిరిండియా పునర్వ్యవస్థీకరణకు టాటా గ్రూప్‌తో కలిసి పనిచేస్తామని పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ తన గగనతలంపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీని కారణంగా ఎయిరిండియాకు రూ.4వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే అది కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఇందుకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. విమాన ప్రమాదంలో ఎయిర్‌లైన్ విధానాల్లో, విమాన నిర్వహణలో ఎలాంటి లోపాలు లేవని ఏఐబీ పేర్కొందని ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. ఈ క్రమంలో విమానయాన సంస్థ మెరుగుపడటం, సిబ్బంది శిక్షణను కఠినతరం చేయడం వంటివి కొనసాగిస్తామన్నారు.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# పెద్ది కొరియోగ్రాఫర్‌గా జానీమాస్టర్

## రేప్ కేసు నిందితుడిని తీసుకోవడంపై రచ్చ

మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొని గతంలో జైలు జీవితం గడిపిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రీఎంట్రీపై టాలీవుడ్‌లో పెద్ద దుమారం రేగుతోంది. ఆయన ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం పెద్దికి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా అతడిని చిత్రబృందం నియమించడంపై నెట్టింట తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొని, పోక్సో చట్టం కింద అరెస్ట్ అయిన వ్యక్తికి మళ్లీ సినీ పరిశ్రమలో పెద్ద హీరో సినిమాలో పనిచేసే అవకాశం ఎలా ఇస్తారంటూ నెటిజన్లు, సినీ వర్గాలు తీవ్ర స్థాయిలో ప్రశ్నిస్తున్నాయి. సినిమా అనేది సమాజంపై బలంగా ప్రభావం చూపే మాధ్యమం. అటువంటి మాధ్యమంలో మహిళలపై నేరాలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులను తిరిగి తీసుకోవడం ద్వారా టాలీవుడ్ ఎలాంటి సందేశం ఇవ్వదలుచుకుందని పెద్ది చిత్ర బృందాని పలువురు నిలదీస్తున్నారు. రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలతో పాటు మైత్రీ మూవీ మేకర్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలు నైతిక విలువలను మర్చిపోయి.. వివాదాస్పద వ్యక్తులకు పని కల్పించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. కేవలం ప్రతిభ ఉందనే కారణంతో తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొన్నవారిని ప్రోత్సహించడం సినీ పరిశ్రమ నైతికతను ప్రశ్నిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ది వంటి పాన్ ఇండియా ప్రాజెక్టులో జానీ మాస్టర్‌కు అవకాశం ఇవ్వడం, టాలీవుడ్ పరిశ్రమలో మీ టూ ఉద్యమం స్ఫూర్తిని, మహిళా భద్రత పట్ల ఉన్న నిబద్ధతను నీరుగార్చిందని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## వయసు గురించి అంత భయమెందుకు

గతేడాది 'స్త్రీ 2' చిత్రంలోని 'ఆజ్ కీ రాత్' పాటతో కుర్రకారుని విశేషంగా అలరించింది తమన్నా. ఆ తర్వాత 'ఓదెలా 2' చిత్రంలోనూ నాయికగా ప్రధాన పాత్ర పోషించింది. ఇలా తెరపై వైవిధ్యమైన పాత్రలతో అటు కథానాయికగానూ.. ఇటు ప్రత్యేక గీతాల్లో తనదైన స్టెప్పులతోనూ అలరిస్తోందీ భామ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నా చిత్ర పరిశ్రమలోని మార్పులు గురించి పలు అంశాలను పంచుకుంటూ, వయసు గురించి ఎందుకు భయపడతారంటూ ప్రశ్నిస్తోంది. "నేడు చిత్రపరిశ్రమలో 30 ఏళ్ల వయసున్న మహిళల పట్ల సానుకూల మార్పు కనిపిస్తోంది. దర్శకులు నటీమణుల కోసం వయసుని పరిగణనలో ఉంచుకుని పరిణతి చెందిన పాత్రలను ప్రత్యేకంగా సృష్టించి మరీ రాస్తున్నారు. ఇప్పుడు ఇండస్ట్రీలో వచ్చిన మార్పులతో నటులు వయసుతో సంబంధం లేకుండా నటనను కొనసాగించవచ్చని నమ్ముతున్నాను. నా ఇరవైల చివరిలో ఉన్నప్పుడు అదృష్టవశాత్తూ పరిశ్రమ ఇలాంటి వైవిధ్యమైన పాత్రలు రాయడం ప్రారంభించింది. చాలా మంది వయసు పెరగడాన్ని ఏదో ఒక వ్యాధిలా భావిస్తున్నారు. కానీ వయసు జీవితంలో చాలా అద్భుతమైనది. అలాంటి దాని గురించి ఎందుకు అంతగా భయపడుతున్నారో నాకు అర్థం కావడం లేదు"అని చెప్పింది. తమన్నా తదుపరి షాహిద్ కపూర్‌తో కలిసి విశాల్ భరద్వాజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ఓ రోమియో'లో కనిపించనుంది.

# కొత్త అనుభూతిని పంచిన బాహుబలి..ది ఎపిక్

బాహుబలి సినిమాల్లో కథ అందరికీ తెలిసిందే. ఈసారి కథ కంటే కూడా మహిష్మతి ప్రపంచాన్ని మరోసారి పెద్ద తెరపై చూడటానికీ, రెండు భాగాలు కలిపి చూసినప్పుడు పాత్రలు పంచే ఆ అనుభూతి ఎలా ఉంటుందో అస్వాదించడానికీ వెళతారు ప్రేక్షకులు. అయితే కథ తెలిసినవాళ్లకయినా.. తెలియని వాళ్లకైనా సరే బాహుబలి : ది ఎపిక్ ఓ కొత్త సినిమా చూసిన అనుభూతిని పంచుతుంది. అందరినీ మరోసారి మాహిష్మతి ప్రపంచంలో లీనం చేసి, పాత్రలతో కలిసి ప్రయాణం చేయించారు దర్శకుడు రాజమౌళి. అలాగని ఇందులో కొత్త సన్నివేశాలేమీ జోడించలేదు. ఒకట్రెండు డైలాగులు తప్ప అదనంగా ఏమీ ఉండవు.



రాజమౌళి తెరపై చూపించిన మాహిష్మతి రాజ్యాన్ని దాని పాలనకు సంబంధించిన రెండు పార్ట్‌లను కలిపి ఒక్కటిగా చూపారు. ఇప్పుడు ఆ రెండు భాగాల్ని కలిపి చూస్తున్నప్పుడు.. ఒకవైపు థ్రిల్ చేసే హీరోయిక్ హై మూమెంట్స్, మరోవైపు కథలోని భావోద్వేగాలు మనసుల్ని కట్టిపడేస్తూ ఎపిక్ అనుభవాన్ని పంచుతుంది. సినిమాని కొత్తగా ఎడిట్ చేసినా.. స్క్రీన్‌ప్లేలో మార్పులేమీ లేవు. తొలి భాగం సినిమాని ప్రథమార్ధంలోనూ, రెండో సినిమాని ద్వితీయార్ధంలోనూ చూపించారు. ప్రథమార్ధంలో పచ్చబొట్టేసినా పాటతోపాటు, శివుడు, అవంతిక పాత్రల మధ్య లవ్ ట్రాక్‌కి కోత పెట్టారు. ఆ ఎపిసోడ్ కథనంతా రాజమౌళి తన వాయిస్ ఓవర్‌తో చెప్పేశారు. ఆ తర్వాత కీలక సన్నివేశాల్ని చూపిస్తూ కథని వేగంగా చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది. ప్రథమార్ధంలో యుద్ధం ఎపిసోడ్స్‌నీ కొంచెం కుదించి చూపించారు. దాంతో అవి మరింత పదునుగా అనిపిస్తాయి. కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడో తెలుసుకునేందుకు ఇప్పుడు రెండేళ్లు ఎదురు చూడాల్సిన అవసరం లేదని సూచిస్తూ తొలి భాగాన్ని ముగించారు. బాహుబలి: ది కన్‌క్లూజన్ కథతో ద్వితీయార్ధాన్ని భావోద్వేగ భరితంగా చూపించి ప్రేక్షకులను మరోసారి కట్టిపడేశారు. ప్రతి ఎపిసోడ్ హైలెట్‌గా నిలుస్తుంది. రెండు భాగాల్లో తొంభై నిమిషాలకుపైగా సన్నివేశాలను తొలగించినా ఆ ప్రభావం సినిమాపై పెద్దగా కనిపించనివ్వకపోవడం విశేషం.

ఒక సినిమాలో అమాంతం సన్నివేశాలు మారినప్పుడు సంగీతం పరంగానూ, విజువల్ కోణంలోనూ సమస్యలొస్తుంటాయి. ఆ విషయాలపై ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని రీవర్క్ చేసినట్టు అనిపిస్తుంది. చాలా రోజుల తర్వాత పెద్ద తెరపైన ప్రభాస్ రాయల్ లుక్‌ని చూడటం అభిమానులకైతే ఓ పండగ అనుభవమే. ప్రభాస్ ని మళ్లీ అలాంటి డైనమిక్ లుక్‌లో, అంత హుషారుగా ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆశని, ఉత్సుకతని రేకెత్తిస్తుందీ చిత్రం. భల్లాలగా రానా దగ్గుబాటిని తప్ప మరొకరిని ఊహించుకోలేం అన్నట్టుగా ఆయన అభినయం మరోసారి మైమరిపిస్తుంది. కీరవాణి సమకూర్చిన సంగీతం కొత్త హంగుల్ని అద్దుకుని మరింత కొత్తగా వినిపించింది. నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంది. మారిన సాంకేతికతకి అనుగుణంగా సంగీతం, విజువల్స్‌కు కొత్త హంగుల్ని సంతరించుకోవడం ది ఎపిక్‌కి మరింతగా కలిసొచ్చింది. ఎడిటింగ్ బాగా కుదిరింది. రెండు భాగాలను కలిపి ఒక సినిమాగా తీసుకొచ్చే ఓ కొత్త దారిని బాహుబలి: ది ఎపిక్ చూపించింది.

## నిరాడంబరంగా నటుడు అల్లు శిరీష్ నిశ్చితార్థం

**హైదరాబాద్, అక్టోబర్ 31 :** నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. నయనికతో కలిసి ఏడడుగులు వేయనున్నారు. ఈ క్రమంలో వీరి నిశ్చితార్థం శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇరు కుటుంబాలతోపాటు కొద్దిమంది బంధువులు, సన్నిహితుల సమక్షంలో శిరీష్- నయనిక ఉంగరాలు మార్చుకున్నారు. చిరంజీవి, నాగబాబు, రామ్‌చరణ్, వరుణ్ తేజ్ తదితరులు తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి సందడి చేశారు. ఈ నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫొటోలు సామాజికమాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.



## వేడుకగా నారా రోహిత్ వివాహం

### హాజరైన నారా చంద్రబాబు దంపతులు



టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ ఓ ఇంటి వాడయ్యడు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అతిరథ మహారాధుల సమక్షంలో ప్రేయసి శిరీష మేడలో మూడు ముళ్ళు వేసాడు నారా రోహిత్. గతేడాది అక్టోబర్ లో నారా రోహిత్ శిరీష్ ల నిశ్చితార్థం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి బంధంతో ఒక్కటి అయ్యారు. శిరీషా స్వస్థలం పల్నాడు జిల్లా రెంటచింతల. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించిన శిరీష నటన పై మక్కువతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. నారా రోహిత్ ప్రధాన పాత్రలో నటించిన ప్రతినిధి2 సినిమాలో రోహిత్ ప్రియురాలిగా నటించింది. అదే సమయంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. అదే విషయాన్ని ఇంటి సభ్యులకు చెప్పారు. వారి అంగీకారంతో ఇప్పుడు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి భువనేశ్వరి దగ్గరుండి అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నారాలోకేష్ దంపతులు, నందమూరి బాలకృష్ణ దంపతులు నూతన జంటను ఆశీర్వదించారు. యంగ్ హీరోలు మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస, శ్రీ విష్ణు ఈ వేడుకకు హాజరయి రోహిత్ దంపతులకు విషెష్ తెలిపారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ వేడకలో పాల్గొని వధూవరులను దీవించారు.

## వివాహబంధంలోకి అడుగిడిన అభిషన్ జీవింత్



టూరిస్ట్ ఫ్యామిలీ చిత్రంతో దర్శకుడిగా తొలి అడుగులోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అభిషన్ జీవింత్ . తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఉదయం తన ప్రియురాలు అక్కీలతో కలిసి ఏడడగులు వేశాడు. టూరిస్ట్ ఫ్యామిలీ ప్రీరిలీజ్ వేడుకలో అభిషన్ తన ప్రియురాలు అక్కీలపై ప్రేమను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 31న నన్ను పెళ్లి చేసుకుంటావా? అంటూ ప్రపోజ్ చేసి అందరిని షాక్‌కి గురిచేశాడు. అయితే చెప్పిన డేట్ ప్రకారమే నేడు అక్కీలను వివాహం చేసుకున్నాడు అభిషన్. ఈ జంటకి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ యువ దర్శకుడికి టూరిస్ట్ ఫ్యామిలీ చిత్ర నిర్మాత మాగేశ్ రాజ్ పాసిలియన్ ఒక అద్భుతమైన బహుమతి ఇచ్చారు. తమ తొలి చిత్రానికి మెగా విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతగా ఆయన అభిషన్‌కు లగ్జరీ బీఎండబ్ల్యూ కారును వెడ్డింగ్ గిఫ్ట్‌గా అందించారు. దర్శకుడిగా మెప్పించిన అభిషన్ ఇప్పుడు నటుడిగా మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. మలయాళ నటి అనస్వర రాజన్‌తో కలిసి హీరోగా నటిస్తున్న తన తదుపరి చిత్రం షూటింగ్ కూడా పూర్తయింది. రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

## అఖండ2 కోసం థమన్ మాస్ థీమ్



నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అఖండ 2: తాండవం చిత్రంపై భారీ అంచనాలు అంతకంతకు పెరుగుతూ ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్ చిత్రంపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పటికే థమన్ అఖండ సినిమా మ్యూజిక్‌తో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసి ఇప్పుడు అఖండ 2 కోసం మరింత పవర్‌ఫుల్, డివైన్ టోన్ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాటలు, సంగీతంపై దృష్టి పెట్టిన తమన్ శ్లోకాలు వల్లించడంలో ఉద్దండులైన వారిని రంగంలోకి దింపుతున్నాడు. ఇప్పటికే ఉత్తరాది నుంచి మిశ్రా బ్రదర్స్ ను తీసుకు రాగా తాజాగా సర్వేపల్లి సిస్టర్స్ ను తెర మీదకు తీసుకు వచ్చాడు. అఖండ 2: తాండవం కోసం థమన్ అందిస్తున్న శక్తిమంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత అద్భుతంగా మార్చేందుకు సర్వేపల్లి సిస్టర్స్ గాత్రాన్ని పాటల కోసం వాడుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బాలయ్య ఎంట్రీ సీన్స్ కోసం ప్రత్యేకమైన శివతాండవ రాగాల కలయికతో థమన్ ఒక ఆధ్యాత్మిక మాస్ థీమ్ రూపొందిస్తున్నారు. ఫ్యాన్స్ ఇప్పటికే థమన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన చిన్న సౌండ్ స్నిప్ వల్ల ఎగ్జైట్ అవుతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com